ఎర్రమట్టితో కాసులు



పిండవుతున్న కొండలు
తరలిపోతున్న ప్రకృతి సంపద
అధికారం మారినా ఆగని అక్రమ మైనింగ్

నకరికల్లు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మారింది.. అయినా అక్రమ మైనింగ్ ఆగడంలేదు. కొండలు పిండవుతున్నాయి. ప్రకృతి సంపద తరలి పోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. ఇలాగే కొనసాగితే కొద్ది నెలల్లోనే నకరికల్లు మండలంలోని కొండలన్నీ కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. మండల పరిధిలోని ఎర్రమట్టి కొండలను పిండి చేస్తూ అక్రమార్కులు కాసులు పోగేసుకుంటున్నారు. ఎక్కడో ఒక చోట మైనింగ్‌కు అనుమతి తీసుకుని మిగతా ప్రాంతాన్నంతా కొల్లగొట్టడమే లక్ష్యంగా అక్రమ మైనింగ్ జరుగుతుంది. మైనింగ్, రెవెన్యూ అధికారులు, పోలీసులు అక్రమ మైనింగ్‌ను కళ్లప్పగించి చూస్తున్నారు. నకరికల్లులోని వాటర్ ట్యాంక్ సమీపంలోని కొండ, చల్లగుండ్లలోని గుర్రాలకొండకు వెనుక వైపున, త్రిపురాపురం వద్ద, నరసింగపాడు, గుండ్లపల్లి సరిహద్దుల్లో అక్రమ మైనింగ్ యథేచ్ఛగా జరుగుతోంది. రాత్రి, పగలు తేడా లేకుండా వందల టిప్పర్లలో మట్టిని తరలిస్తున్నారు. ఒక్కో టిప్పర్‌కు ఆరు వేల నుంచి రూ.10 వేల వరకు వసూలు చేస్తున్నారు. ఎవరైనా అటువైపుగా వెళ్లినా వారిని అక్రమార్కులు బెదిరిస్తున్నారు. మీడియాలో వార్తలు వచ్చిన సమయంలో ఒకటి రెండు రోజులు హడావుడి చేయడంతోనే అధికారులు సరిపెడుతున్నారు. ఇంటి నిర్మాణాలకు కొద్దిపాటి మట్టి అవసరమైతే తీసుకెళ్లే వారిని పట్టుకుని నిబంధనలు చెప్పే అధికారులు వందలాది టిప్పర్లు తరలిపోతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీ నేతలతో పాటు వైసీపీకి చెందిన నేతలు కూడా ఈ అక్రమ రవాణాకు వాహనా లను సరఫరా చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.



గణతంత్ర వేడుక..
పండుగలా నిర్వహించాలి

కవాతు మైదానంలో పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి
ఏర్పాట్ల పరిశీలన.. అధికారులతో కలెక్టర్ అరుణ్‌బాబు సమీక్ష

నరసరావుపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): గణ తంత్ర దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో నిర్వ హించాలని కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమీపంలో పోలీసు శాఖ నిర్మిస్తున్న కవాతు మైదానంలో గణతంత్ర వేడుకలకు జరుగుతున్న ఏర్పాట్లను తొలుత ఎస్పీ శ్రీనివాసరావు, అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. గణతంత్ర వేడుకల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. లోటుపాట్లు ఎదురు కాకుండా చూసుకోవాలన్నారు. అధికారులంతా ఒక కుటుం బంలా వేడుకలను నిర్వహించాలన్నారు. ప్రజాప్రతి నిధులు, అధికారులు, ప్రజల కోసం ప్రత్యేకంగా గ్యాలరీలతో పాటు పార్కింగ్ ఏర్పాట్లు చేపట్టాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ, శకటాల ప్రదర్శ నలతోపాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల స్టాల్స్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జేసీ సూరజ్, డీఆర్వో మురళి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



పోలీసు కవాతు మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు, జేసీ సూరత్, డీఆర్వో మురళి తదితరులు



వినుకొండ : లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా విఠంరాజుపల్లి గ్రామ సమీపంలో గల సెయింటాన్స్ ఉషోదయ దివ్యాంగుల పాఠశాలలో పిల్లలతో కలిసి కేక్ కట్‌చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన



చిలకలూరిపేట : టీడీపీ కార్యాలయంలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, టీడీపీ నేతలు

రబీ సాగు.. 70 శాతమే

◆ పెరిగిన మొక్కజొన్న.. తగ్గిన శనగ ◆ విస్తృతంగా వరి, పొగాకు వేసిన రైతులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రబీ సీజన్‌లో పంటల సాగు అంచనాలు తారుమారయ్యాయి. ఇప్పటి వరకు చూస్తే సాధారణ విస్తీర్ణంలో 70 శాతం మాత్రమే సాగు చేశారు. జిల్లాలో రబీలో పంటల పంటల సాగు సాధారణ విస్తీర్ణం 1,30,157 ఎకరాలు కాగా 90,880 ఎకరాల్లో మాత్రమే పంటలు సాగయ్యాయి. రైతులు ప్రధానంగా వరి, మొక్కజొన్న, శనగ, పొగాకు పంటలను సాగు చేశారు. రైతులు ఎక్కువగా మొగ్గు చూపడంతో మొక్కజొన్న సాగు గణనీయంగా పెరిగింది. మొక్కజొన్న సాధారణ విస్తీర్ణం 21212 ఎకరాలు కాగా 24,238 ఎకరాల్లో సాగు చేశారు. మొక్కజొన్న సాగు 114 శాతంగా నమోదైంది. పొగాకు, మొక్కజొన్న, శనగ పంటల సాగు పూర్తి అయ్యింది. ఈ పంటలు కాపు దశలో ఉన్నాయి. సాధారణం కన్నా 14 శాతం అధికంగా మొక్కజొన్న పంటను రైతులు సాగు చేశారని వ్యవసాయ అధికారులు తెలిపారు. మొక్కజొన్న కంటే పొగాకు పంటను రైతులు ఎక్కువగా వేశారు. పొగాకు సాధారణ విస్తీర్ణం 4,472 ఎకరాలు కాగా 13,727 ఎకరాల్లో సాగైంది. 307 శాతం నమోదైంది. ఏటా శనగ సాగు చేసే రైతులు పొగాకు వైపు మొగ్గు చూపడంతో విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. శనగ సాధారణ విస్తీర్ణం 29,495 ఎకరాలు కాగా 17,102 ఎకరాల్లో సాగు చేశారు. గత ఏడాది శనగ 44,342 ఎకరాల్లో సాగు చేశారు. క్రితం సంవత్సరం కన్నా దాదాపు 14,847 ఎకరాల్లో సాగు తగ్గింది. వరి సాధారణ విస్తీర్ణం 58,513 ఎకరాలు కాగా ఇప్పటికి 28,870 ఎకరాల్లో సాగు చేశారు. రానున్న 15 రోజుల్లో వరి సాగు పూర్తవుతుందని అంచనా. ఖరీఫ్‌లో ధాన్యం దిగుబడులు ఆశాజనకంగా ఉండటంలో వరి సాగు పెరుగుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.



సాగర్‌లో పుష్కలంగా నీరు

నాగార్జున సాగర్‌లో నీటి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా 227.29 టీఎంసీల నిల్వ ఉంది. మిర్చికి మార్చి 31 వరకు, వరికి ఏప్రిల్ నెలాఖరు వరకు సాగు నీరు అవసరం ఉంది. గతంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా సాగు నీటిని సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

నరహంతకుడు.. మన్నయ్యపై పీడీ యాక్టు 8



ఎస్ఆర్ఎంలో సిస్టమ్స్ ఇంజనీరింగ్ సమ్మిట్



ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న రిజిస్ట్రార్ ప్రేమ్‌కుమార్, రామకృష్ణ

మంగళగిరి సిటీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో రెండు రోజులపాటు జరిగే సిస్టమ్స్ ఇంజనీరింగ్ సమ్మిట్ గురువారం ప్రారంభమైంది. వర్సిటీలోని అబ్దుల్ కలాం ఆడిటోరియం వేదికపై వర్సిటీ ఉపకులపతి ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా జ్యోతి ప్రజ్వలన చేసి సమ్మిట్‌ను ప్రారంభించారు. ఎఫ్ట్రానిక్స్ సిస్టమ్స్ లిమిటెడ్ ఎండీ దాసరి రామకృష్ణ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్రంలోని వివిధ కంపెనీల మేనేజింగ్ డైరెక్టర్లు, సీఈవోలు, పరిశోధనా రంగానికి చెందిన నిపుణులు పాల్గొన్నారు. వీసీ మనోజ్‌కుమార్ మాట్లాడుతూ అన్ని రంగాల్లోనూ సిస్టమ్స్ ఇంజనీరింగ్ ప్రాధాన్యత పెరుగుతుందని చెప్పారు. ఈ నేపథ్యంలో వర్సిటీలు సైతం పాఠ్య ప్రణాళికను తదనుగుణంగా మార్చుకోవాలని సూచించారు. రామకృష్ణ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న దేశాలు సిస్టమ్స్ ఇంజనీరింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాయని, నూతన ప్రాజెక్టుల ఆవిష్కరణకు సిస్టమ్స్ ఇంజనీరింగ్ దోహదపడుతుందని తెలిపారు. ఏవియేషన్, రైల్వేస్, ఎలక్ట్రికల్స్, ఆటోమొబైల్ రంగాల్లో సిస్టమ్స్ ఇంజనీరింగ్ నిపుణులకు మంచి అవకాశాలు లభిస్తున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఎం-ఎఫ్ట్రానిక్స్ మధ్య ఎంవోయూ కుదిరింది. ఇంకోస్ సంస్థ వివిధ యూనివర్సిటీలతో ఎంవోయూ చేసుకుంది.విజయవాడ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల వీసీ డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, ఏపీ వీఐటీ వీసీ డాక్టర్ ఎస్‌వీ కోటారెడ్డి, విజ్ఞాన్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ గంగాధరరావు, బోయింగ్ సంస్థ ఫెలో డాక్టర్ యోగానంద్, ఎస్ఆర్ఎం అసోసియేట్ డీన్ డాక్టర్ మహేశ్వర్ ద్వివేది, ఈసీఈ హెడ్ డాక్టర్ సునీత పాల్గొన్నారు.

హాస్టల్ గదిలో విద్యార్థి ఆత్మహత్య

మంగళగిరి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ గదిలో ఉరి వేసుకుని ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం మంగళగిరిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళగిరి మండలం కురగల్లు గ్రామం పరిధిలోని అమృత విశ్వవిద్యాలయ పీఠం కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్న కేకే నవదేవ్ (22) హాస్టల్ గదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న మంగళగిరి రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకట్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. సీసీ కెమెరాలను పరిశీలించి, ఆత్మహత్యకు ముందు నవదేవ్ రాసిన సూసైడ్ నోట్, నోటు పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని తెలిపారు.

నియోజకవర్గ స్థాయిలో సమస్యల పరిష్కార వేదిక

- అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆధార్ నమోదు ప్రక్రియ
- పింఛన్ అర్హులకు అందించేందుకే తనిఖీలు
- కలెక్టర్ అరుణ్‌బాబు



సమావేశంలో కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ సూరజ్, డీఆర్వో మురళి

నరసరావుపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వం ఏర్పాటు అనంతరం ఆరు నెలల్లో జిల్లా ప్రగతికి అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నామనీ, రానున్న రోజుల్లో జిల్లా అభివృద్ధికి మరింత కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అమలు చేస్తున్న కార్యక్రమాలను వివరించారు. వచ్చే నెల నుంచి ప్రతి నియోజకర్గం స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనే ఆధార్ నమోదు ప్రక్రియ జరుగుతుందన్నారు. ప్రభుత్వ స్కూల్స్‌లో తరగతుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల రేషనలైజేషన్‌ను నిర్వహిస్తామని స్పష్టం చేశారు. పదో తరగతి పరీక్షల్లో జిల్లా ఉత్తీర్ణత శాతం పెంచేందుకు 'లక్ష్య సాధన' కార్యక్రమం చేపట్టామన్నారు. దీని ద్వారా ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. అర్హులకు మాత్రమే పింఛన్ అందించడం ప్రభుత్వ లక్ష్యమని, అందుకే పింఛన్ లబ్ధిదారుల తనిఖీలు జరగుతున్నాయన్నారు. ఏప్రిల్ నుంచి వ్యవసాయానికి ప్రతి మండలానికి ఒక డ్రోన్ మంజూరు చేస్తామని చెప్పారు. ఆరు నెలల్లో కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్‌కు 11,176 పిటీషన్లు అందగా, వాటిల్లో 7258 పరిష్కరించామనీ, మిగిలిన అర్జీలు వివిధ దశల్లో పరిష్కార ప్రక్రియలో ఉన్నాయన్నారు.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా..

విద్యార్థుల సంఖ్య ఆధారంగా ప్రభుత్వ పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించే విధానానికి బదులుగా పాఠశాలలో ఉన్న తరగతుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయులను కేటాయింపు చేసే విధానాన్ని రానున్న విద్యా సంవత్సరంలో అవలంబించనున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల రేషనలైజేషన్‌లో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య ఏ మాత్రం తగ్గదన్నారు. జిల్లాలో వివిధ ఆరోగ్య సమస్యల వల్ల పూర్తిగా మంచానికి పరిమితమైన వారికి అందించే రూ.15,000 పింఛన్ పూర్తిగా అర్హులకు అందించేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాగార్జున సాగర్ వద్ద విమానాశ్రయం ఏర్పాటుపై ఫీజిబిలిటీ స్టడీ కొనసాగుతోందని, ఇప్పటికే మంజూరైన జాతీయ రహదారులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో లెదర్ పరిశ్రమ ఏర్పాటు కోసం రెండు, మూడు నియోజకవర్గాల్లో భూముల పరిశీలన జరిగిందని చెప్పారు. దుర్గిలో నిలిచిపోయిన లెదర్ పరిశ్రమ ఏర్పాటును కొనసాగించే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు మొత్తం 40 డ్రోన్లు మంజూరయ్యాని, రైతు సమూహాలకు శిక్షణ ఇచ్చి మండలానికి కనీసం ఒక డ్రోన్ నిర్వాహకుడు ఉండేలా చూస్తాం అన్నారు. ఫిబ్రవరి నాటికి జిల్లాలో మొత్తం 426 చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలను వినియోగంలోకి తీసుకువస్తామని చెప్పారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే, డీఆర్వో మురళి పాల్గొన్నారు.

మిర్చి రైతులకు నాణ్యమైన భోజనం

- మార్కెటింగ్ డైరెక్టర్ సునీత
- తొలి రోజు 1100 మంది రైతులకు వడ్డన
- గతేడాది 1.50 లక్షల మందికి లబ్ధి



భోజనం వడ్డిస్తున్న మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ విజయ సునీత, యార్డు పర్సన్ ఇన్‌చార్జ్ భార్గవ తేజ

గుంటూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయంగా ఖ్యాతి గడించిన మిర్చియార్డులో మిరపకాయలను అమ్మకానికి తీసుకొచ్చే రైతులకు ఉచితంగా నాణ్యమైన భోజనాన్ని వడ్డిస్తామని మార్కెటింగ్ శాఖ కమిషనర్, డైరెక్టర్ విజయ సునీత తెలిపారు. గురువారం మధ్యాహ్నం మిర్చియార్డులోని రైతు భోజనశాలలో ఆమె మార్కెట్ కమిటీ పర్సన్ ఇన్‌చార్జ్, జాయింట్ కలెక్టర్ అమిలినేని భార్గవతేజతో కలిసి రైతులకు మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం రైతులకు స్వయంగా ఆహార పదార్థాలను వడ్డించారు. ఈ సందర్భంగా వారితో కాసేపు సంభాషించారు. రైతులు మాట్లాడుతూ తమకు ప్రస్తుతం యార్డులో క్వింటాల్‌కు రూ. 10 వేల నుంచి రూ. 15 వేల వరకే రకాన్ని బట్టి ధర వస్తుందని, ఇది రూ. 20 వేలు దాటేలా చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు కమిషనర్ విజయ సునీత స్పందిస్తూ తాము త్వరలోనే కమీషన్, ఎగుమతి వ్యాపారస్తులతో సమావేశాలు నిర్వహించి ధర పెరిగేందుకు అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. మధ్యాహ్న భోజనం గురించి మాట్లాడుతూ గతేడాది సీజన్‌లో 1.50 లక్షల మంది రైతులకు ఈ కార్యక్రమం ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. ఈ సంవత్సరం కూడా అంతకంటే ఎక్కువ మందికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం పెడతామన్నారు. భోజనంలో ఎక్కడా నాణ్యత తగ్గకుండా నిరంతరం మార్కెటింగ్ అధికారులతో పర్యవేక్షణ జరిపిస్తామన్నారు. పర్సన్ ఇన్‌చార్జ్ భార్గవ తేజ మాట్లాడుతూ మిర్చియార్డులో రైతే రారాజని చెప్పారు. రైతుకు ఎక్కడా ఇబ్బంది కలగకుండా చూసుకొనే బాధ్యత మార్కెట్ కమిటీదేనన్నారు. రైతులు విశ్రాంతి తీసుకొనేందుకు ఎయిర్ కండీషనింగ్ సదుపాయం కలిగిన హాల్స్ అందులో పడకలు సిద్ధం చేశామని తెలిపారు. రైతుల సౌలభ్యం కోసం రెండు భోజన కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనంలో ఒక స్వీటు, హాటు, పప్పు, ఇగురు, వేపుడు, పచ్చడి, అప్పడాలు, సాంబార్, పెరుగు నిత్యం వడ్డిస్తామన్నారు. తొలి రోజున 1100 మంది భోజనం చేయడం సంతోషకరమని చెప్పారు. మిర్చియార్డు సెక్రెటరీ వినుకొండ ఆంజనేయులు మాట్లాడుతూ గత ఏడాది అల్పాహారం, భోజనం కలిపి ఒక్కో రైతుకు రూ.150 వరకు వెచ్చించారని చెప్పారు. ఈ సంవత్సరం తాము కాంట్రాక్టర్లతో చర్చలు జరిపి రేటుని రూ. 132.65 పైసలకే ఒప్పించామన్నారు. దీనివలన ఒక్కో ప్లేటుపై రూ.17.35 పైసల ఖర్చు తగ్గించామన్నారు. సీజన్ ముగిసేనాటికి దాదాపుగా రూ. 25 లక్షల వరకు ఆదా అయ్యే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో మిర్చియార్డు అధికారులు సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్, నరేంద్ర, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా ఎడ్లజతకు ప్రథమ స్థానం



ఎడ్ల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి


దుర్గి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): దుర్గిలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవాలను పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఎడ్ల బండలాగుడు పోటీలు గురువారంతో ముగిశాయి. చివరిరోజు జరిగిన సేద్యపు విభాగం పోటీలను మాచర్ల శాసన సభ్యుడు జూలకంటి బ్రహ్మనందరెడ్డి ప్రారంభించారు. ఈ పోటీల్లో బాపట్ల జిల్లా సంతమాగులూరుకు చెందిన వజ్రాల తేజస్విరెడ్డి ఎడ్ల జత నిర్ణీత సమయంలో 5524 అడుగుల దూరం బండను లాగి ప్రథమస్థానంలో నిలిచాయి. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పురావూరుకు చెందిన తోట శ్రీనివాసరావు ఎడ్లజత 5361 అడుగులతో రెండోస్థానం, పల్నాడు జిల్లా క్రోసూరు మండలం ఉయ్యందనకు చెందిన సంపటం వీరబ్రహ్మంనాయుడు ఎడ్లజత 5082 అడుగులతో మూడోస్థానం, గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెదగొట్టిపాడుకు చెందిన గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్లజత 5 వేల అడుగులతో నాలుగోస్థానం, పల్నాడు జిల్లా శ్యావల్యాపురం మండలం శానంపూడికి చెందిన అమృతపురి కోటయ్య ఎడ్లజత 4500 అడుగులతో ఐదోస్థానం, ప్రకాశం జిల్లా పుల్లల చెరువు మండలం మరివేములకు చెందిన సిద్ధి మల్లీశ్వరి ఎడ్లజత 4282 అడుగులతో ఆరోస్థానంలో నిలిచాయి. రిఫరీలుగా గూడా శ్రీనివాసరావు, బండ్ల ప్రసాద్ వ్యవహరించారు. కటకం రామారావు, గందె గోపాలరావు పర్యవేక్షణలో జరిగిన పోటీల్లో ఎంపీపీ యేచూరి సునీతాశంకర్, లింగా రమేష్, చిరుమామిళ్ల కృష్ణయ్య, మాగులూరి నారయ్య, శ్రీహరి, తోటకూర శ్రీనివాసరావు, రుద్రాల రవి, సూరె వెంకటేశ్వర్లు, మేకల దాసు, సింగు నాగేశ్వరరావు, శ్రీరాం కాశీబాబు, వంకమళ్ల కోటేశ్వరరావు, ముత్తినేని పుల్లయ్య, దేవరగట్టు బ్రహ్మయ్య, ఆకుల చిన చెన్నయ్య, నాదెండ్ల శ్రీను, జక్కా రమేష్, పసుమర్తి బుజ్జి, గర్నిడి రమేష్, సూరె కృష్ణ, యెల్లబోయిన గోపాల్, ఆకుల లక్ష్మణ, గోళ్ల సిద్ధయ్య, మునుగోటి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు మాజీ మంత్రి వీరయ్య చౌదరి 31వ వర్ధంతి



పొన్నూరు టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పాల రైతుల ఆరాధ్య దైవం, క్షీర విప్లవ సారథి, మాజీ మంత్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి 31వ వర్ధంతి కార్యక్రమాలను శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించేందుకు తెలుగుదేశం పార్టీ విస్తృత ఏర్పాట్లు చేసింది. పొన్నూరు మండలం చింతలపూడి గ్రామంలో జన్మించిన వీరయ్య చౌదరి సర్పంచిగా రాజకీయ ప్రస్థానం సాగించి అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రిగా ఎన్టీఆర్ క్యాబినెట్లో పని చేశారు. వీరయ్య చౌదరి ఓవైపు రాజకీయ రంగంలో రాణిస్తూనే మరోవైపు రైతుల సంక్షేమం కోసం అహర్నిశలు పాటుపడ్డారు. పంటకు గిట్టుబాటు ధర లేక తీవ్ర అవస్థలు పడుతున్న రైతాంగానికి ఆర్థిక ప్రయోజనాలు కల్పించేందుకు సంగం డెయిరీని వేదికగా చేసుకొని రైతులను పాడి పరిశ్రమ వైపు మళ్లించారు. పాడి పరిశ్రమ ద్వారా రైతులకు అదనపు ఆదాయం సమకూరేలా వీరయ్య చౌదరి చేసిన కృషి ఆయన్ను పాలవాళ్ల ధూళిపాళ్లగా మార్చివేసింది. పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పనిచేసి రాష్ట్ర వ్యాప్తంగా పాల సొసైటీలను ఏర్పాటు చేయించారు. వీరయ్య చౌదరి చేసిన కృషి ఫలితంగా సంగం డెయిరీ నేడు దక్షిణ భారతదేశంలోనే అగ్రగామిగా పేరుగాంచింది. 1994 జనవరి 24న రోడ్డు ప్రమాదంలో వీరయ్య చౌదరి మృతి చెందారు. నేటికి 31 ఏళ్లు అయ్యాయి. ఆయన తదనంతరం ఆయన కుమారుడు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పొన్నూరు ఎమ్మెల్యేగా ఇప్పటికి ఆరు పర్యాయాలు గెలుపొందారు. సంగం డెయిరీ చైర్మన్‌గా ఎన్నికై దక్షిణ భారతదేశంలో ఆ సంస్థను నంబర్ వన్‌గా తీర్చిదిద్దారు. నేడు ధూళిపాళ్ల వీరయ్య చౌదరి వర్ధంతి నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉదయం 7.15 గంటలకు చింతలపూడిలోని స్మృతి వనం వద్ద కుటుంబ సభ్యులు నివాళులర్పించనున్నారు. అనంతరం వరుస కార్యక్రమాలు పొన్నూరు-చేబ్రోలు మండలాల్లో నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. చేబ్రోలు మండలంలోని వడ్లమూడి గ్రామంలో వీరయ్య చౌదరి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం నాలుగు గంటలకు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో వర్ధంతి సభ నిర్వహించనున్నట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి.

కంకణాలపల్లిలో భూముల రీ సర్వే



రీ సర్వే పనులను పరిశీలిస్తున్న అడిషనల్ డైరెక్టర్ గోవిందరావు

సత్తెనపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కంకణాలపల్లిలో జరుగుతున్న భూముల రీ సర్వే పనులను గురువారం సర్వే అండ్ ల్యాండ్స్ రికార్డ్స్ అడిషనల్ డైరెక్టర్ గోవిందరావు, ఆర్డీవో రమణకాంత్‌రెడ్డిలు పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న భూముల రీ సర్వేలో భాగంగా కంకణాలపల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి మూడు సర్వే బృందాలు సర్వే నిర్వహిస్తున్నాయని వారు తెలియ జేశారు. గ్రామంలో మొత్తం 1785 ఎకరాల భూమి ఉందని, 286 సర్వే నెంబర్లు ఉన్నాయని, 762 ఖాతాలు ఉన్నాయని తెలిపారు. గ్రామంలోని పట్టా ల్యాండ్, ప్రభుత్వ ల్యాండ్‌ను గుర్తించి గ్రామ సరిహద్దులు ఏర్పాటు చేశామన్నారు. మండలంలో ప్రయోగాత్మకంగా కంకణాలపల్లి గ్రామాన్ని ఎంపిక చేసి సర్వే చేయటం జరిగిందన్నారు. రీ సర్వే పై గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. రీ సర్వేలో భాగంగా పొలాల గట్లు, విస్తీర్ణాన్ని పక్కా కొలవటం జరుగుతుందన్నారు. రీ సర్వే వల్ల గతంలో జరిగిన తప్పులను దిద్దుబాటు చేసే అవకాశం ఉంటుందన్నారు. వారితో పాటు తహసీల్దార్ చక్రవర్తి, సర్వేయర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏషియన్ యోగాలో బంగారు పతకం కైవసం



ధీరజ్ శ్రీకృష్ణను అభినందిస్తున్న భాష్యం రామకృష్ణ

గుంటూరు (విద్య), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): భాష్యం విద్యార్థులు చదువుతోపాటు ఎంచుకున్న రంగాల్లో రాణిస్తూ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చూపడం గర్వంగా ఉందని సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. గురువారం భాష్యం మెయిన్ క్యాంపస్‌లో ఇటీవల సింగపూర్‌లో జరిగిన యోగ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన 9వ తరగతి విద్యార్థి ధీరజ్ శ్రీకృష్ణ అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 6 నుంచి మూడు రోజులపాటు సింగపూర్‌లో జరిగిన ఏషియన్ యోగ స్పోర్ట్స్ చాంపియన్ షిప్ పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన ధీరజ్ కృష్ణ ఒక పసిడి, రెండు రజిత పతకాలు, ఒక కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. జూనియర్ విభాగంలో తలపడిన ధీరజ్ కృష్ణ ఆర్టిస్ట్ యోగాలో పసిడి పతకం, యోగాసన ఆర్టిస్ట్ ఫెయిర్ యోగాలో రజిత పతకం, రిథమిక్ యోగాలో కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థి ధీరజ్ శ్రీకృష్ణ మాట్లాడుతూ యోగాలో ప్రతిభ చూపుతున్న తనకు లక్ష రూపాయలు చైర్మన్ భాష్యం రామకృష్ణ ప్రోత్సాహకంగా అందించారని తెలిపారు. ధీరజ్ శ్రీకృష్ణ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాగర్ విమానాశ్రయ భూములను పరిశీలించిన అధికారులు



విజయపురిసౌత్‌లో భూములను పరిశీలిస్తున్న ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా సభ్యులు

మాచర్ల రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీకి చెందిన ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా నేతృత్వంలోని జాయింట్ జనరల్ మేనేజర్ ఏఎస్ఎన్ మూర్తి ఆధ్వర్యాన ఆరుగురు సభ్యుల బృందం గురువారం నాగార్జునసాగర్‌లో విమానాశ్రయం ఏర్పాటుకు కావాల్సిన భూములను పరిశీలించారు. గురజాల ఆర్డీవో మురళీకృష్ణతో కలిసి ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు విజయపురిసౌత్, పశువేముల, చింతలతండా, నాగులవరం గ్రామాల్లో విమనాశ్రయం ఏర్పాటుకు ప్రతిపాదించిన భూములను పరిశీలించి నివేదికను సిద్ధం చేశారు. సాగర్‌లో నూతన ఎయిర్‌పోర్టుకు కావాల్సిన సౌకర్యాలు, వాతావరణ పరిస్థితులను అంచనా వేశారు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా బృందం వెంట తహసీల్దార్ కిరణ్‌కుమార్, ఆర్ఐ అనిల్‌కుమార్, సర్వేయర్ రఘుపతి ఉన్నారు.

హిమాలయ అగ్రిటెక్‌పై నిఘా ఉంచాం

- విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ సూర్య శ్రావణ్ కుమార్



గుంటూరు సిటీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా పురుగు మందులు, బయో ఉత్పత్తులు రైతులకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న హిమాలయ అగ్రిటెక్‌పై పూర్తి స్థాయిలో నిఘా ఏర్పాటు చేసినట్లు గుంటూరు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ డి.సూర్యశ్రావణ్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ హిమాలయ అగ్రిటెక్‌పై వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో వినుకొండ సమీప ప్రాంతంలోని గ్రామంలో ప్రత్యేకంగా తనిఖీ చేపట్టినట్లు వివరించారు. అక్కడ గతంలో అదే సంస్థ పేరుతో వ్యాపారం చేసి పురుగు మందులు అమ్మినట్లు తేలిందని, ప్రస్తుతం అక్కడ ఏ విధమైన కార్యకలాపాలు జరగడం లేదని తెలిపారు. ఇదే సంస్థ పై గతంలో నకిలీ మందులు అమ్మారన్న ఆరోపణలపై వినుకొండలో కేసులు నమోదు అయినట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. తాజాగా ఫిర్యాదు వచ్చిన నేపథ్యంలో చేసిన తనిఖీలో పల్నాడు ప్రాంతంలో అమ్మకాలు జరపడం లేదని తేలిందన్నారు. గుంటూరు పరిసర ప్రాంతాల్లో అమ్మకాలు జరుపుతున్నట్టు వార్తలు వస్తున్న నేపథ్యంలో నిఘా ను ఉంచామని తెలిపారు.

ఆరుగురు గంజాయి విక్రేతలు అరెస్టు

- 1250 గ్రాములు స్వాధీనం

తాడేపల్లి టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి పరిధిలో గంజాయి తాగుతూ, విక్రయిస్తున్న ఆరుగురిని సీఐ కల్యాణ్‌రాజు అరెస్టు చేశారు. పోలీసు స్టేషన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నార్త్ జోన్ డీఎస్పీ మురళీకృష్ణ వివరాలు వెల్లడించారు. పట్టణంలోని కృష్ణా కెనాల్ రైల్వే జంక్షన్ సమీపంలో కొందరు యువకులు గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు సిబ్బందితో కలిసి నిఘా పెట్టి దాడి చేశారు. ఈ ఘటనలో నందు బంర్రెడ్డి, షేక్ మహబూబ్ బాషా, ఓట్ల ప్రవీణ్, మేడా ఆనందరావు, షేక్ బాజి, షేక్ మహబూబ్ జానీ అనే ఆరుగులు యువకులను అదుపులోకి తీసుకోగా మహానాడుకు చెందిన మణికంఠ అనే యువకుడు పారిపోయాడని తెలిపారు. వీరి నుంచి 1 కేజీ 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

తెనాలిలో రెచ్చిపోయిన మరో రౌడీషీటర్

తెనాలి అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణంలో మరో రౌడీషీటర్ రెచ్చిపోయాడు. దుకాణదారునితో స్నేహంగా ఉంటూ మద్యం మత్తులో చెప్పిన మాట వినలేదని దౌర్జన్యం చేసి గాయపరిచాడు. టు టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రకాశం రోడ్డులో బెల్లం టీ స్టాల్ ఎదురు సమోసా పాయింట్‌ను మల్లెపాడుకు చెందిన శ్రీరాంరాజు నడుపుకుంటున్నాడు. ఐతానగర్‌కు చెందిన రౌడీషీటర్ నూతలపాటి అరుణ్ తరచూ రాజు షాపు దగ్గరకు వస్తూ అతనికి స్నేహితుడు అయ్యాడు. గురువారం ఉదయం ఫోన్ చేసి గాంధీచౌక్‌లో దింపమని కోరాడు. ద్విచక్ర వాహనంపై దించి వచ్చిన అతడిని మళ్లీ మధ్యాహ్నం తరువాత మద్యం దుకాణంలో ఉన్నాను, ద్విచక్ర వాహనం వేసుకుని రమ్మని ఫోన్ చేశాడు. పిల్లలను స్కూల్ నుంచి తీసుకు రావాలని, రావడం కుదరదని శ్రీరాంరాజు చెప్పాడు. దీంతో రౌడీషీటర్ బెదిరించడంతో, చేసేది లేక అతని వద్దకు వెళ్లిన రాజును బండి తాళం తీసుకుని చెవిలో పొడిచాడు. తరువాత బైక్‌పై ఎక్కి రజక చెరువు వద్ద దిగి ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తానని బెదిరించాడు. దీంతో రాజు అతని సోదరుని సాయంతో ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లి చికిత్స చేయించుకున్నాడు. టు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం గురువారం నాటికి 557.40 అడుగులు ఉంది. ఇది 226.37 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 9633, ఎడమ కాలువ ద్వారా 7353, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 17,024, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2200, ఎల్ఎల్‌సీ ద్వారా 280 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 36,490 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	145.154.165
చికెన్ విత్ స్కిన్	280.00
చికెన్ స్కిన్ లెస్	290.00

96,802 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత మిర్చి సీజన్‌లో తొలిసారి ఒకే రోజున లక్షకు పైగా మిర్చి టిక్కీలు అమ్మకానికి రైతులు తీసుకొచ్చారు. మిర్చియార్డుకు గురువారం ఒక్క రోజే 1,01,210 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 96,802 అమ్మకం జరిగినట్లు మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 63,895 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	14000	334	8000	13300
నెంబరు. 5	8000	13500	నెంబరు.5	9000	9000
273	11000	11000	273	--	--
341	9500	15000	341	9000	10000
4884	12000	12000	4884	--	--
సూపర్ 10	9500	11000	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7200	15500	తేజ	7200	15000
బ్యాడిగి	7500	14000	బ్యాడిగి	8500	12500
దేవనూరు డీలక్స్	10000	14000	దేవనూరు డీలక్స్	11500	11500
తెల్లకాయలు	4000	10500	తెల్లకాయలు	4500	8500

పులిచింతల సమాచారం

అచ్చంపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో గురువారం 37.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పవర్ జనరేషన్ ద్వారా రెండు వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నామని తెలిపారు.


ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి లీలావతి

సబ్ జైలులో జడ్జి తనిఖీ

సత్తెనపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సబ్ జైలును గురువారం గుంటూరు జిల్లా న్యాయసేవాధికార కమిటీ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) లీలావతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. జైలులోని పరిసరాలను, వంటశాలలను, స్నానపు గదులను పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యత గురించి, అందుతున్న సౌకర్యాల గురించి ముద్దాయిలను, రిమాండ్ ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. జైలు సూపరింటెండెంట్ వెంకటరత్నం ముద్దాయిల వివరాలను జడ్జికి తెలియజేశారు. ముద్దాయిలకు చట్ట ప్రకారం ఉన్న హక్కులను జడ్జి వివరించారు. భవిష్యత్‌లో సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. ఆమెతో పాటు ప్యానల్ న్యాయవాది బీఎల్ కోటేశ్వరరావు, పారా లీగల్ వాలంటీరు షేక్ సుభానీ పాల్గొన్నారు.

వాసవీక్లబ్ డిస్ట్రిక్ జోన్ చైర్మన్‌గా

చెన్నకేశవరావు

మాచర్లటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 204ఏ జోన్ చైర్మన్‌గా మాచర్ల వాసవీక్లబ్ పూర్వ అధ్యక్షుడు ఓరుగంటి చెన్నకేశవరావు నియమితులయ్యారు. ఈమేరకు క్లబ్ గవర్నర్ మునగాల చిరంజీవి నుంచి గురువారం చెన్నకేశవరావు నియామకపత్రం అందుకున్నారు.

డ్రోన్ నిఘాలో గొట్టిముక్కల

గురజాలటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొట్టిముక్కలలో గురువారం డీఎస్పీ జగదీష్ ఆధ్వర్యాన డ్రోన్ నిఘా నిర్వహించారు. గ్రామంలో నాటుసారా, పేకాట నిరోధించేందుకు డ్రోన్ నిఘా నిర్వహించినట్లు డీఎస్పీ జగదీష్ తెలిపారు. ఆయన వెంట సీఐ భాస్కర్, ఎస్ఐ వినోద్‌కుమార్ ఉన్నారు.

నేడు ఆలయ భూములకు వేలం

బెల్లంకొండ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ మండలంలోని కేతవరం లక్ష్మీనరసింహ స్వామి ఆలయ భూములకు శుక్రవారం ఉదయం 10 గంటలకు కౌలు వేలం నిర్వహిస్తున్నట్టు మండల దేవాదాయ శాఖ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాటలో పాల్గొన దలచిన వారు రూ.1000 చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

బీజేపీలోకి చేరికలు..

బెల్లంకొండ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన జూలకంటి సుప్రియారెడ్డి, మరి కొంత మంది గురువారం భారతీయ జనతా పార్టీలో చేరారు. నియోజక వర్గ భారతీయ జనతా పార్టీ కన్వీనర్ తుమ్మా వెంగళరెడ్డి వారికి పార్టీ కుండవా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యకమంలో బీజేపీ బెల్లకొండ, క్రోసూరు మండలాల అధ్యక్షులు ఓర్సు రాజు, దమ్మాలపాటి వెంకట శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, నేతలు కామేశ్వరచారి, వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ వైద్యశిబిరం

బెల్లంకొండ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొత్తపాలెం ఎంపీపీ పాఠశాల ముందు ప్రభుత్వ ఆయుష్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యం గూర్చి వివరించారు. అనంతరం విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల దుర్గారావు, సునీత, మధులత, మేరీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

అజరామరం నేతాజీ పోరాటం

రెంటచింతల,జనవరి 23: వలస పాలనను ప్రతిఘటించడంలో, ఎదురొడ్డి ధైర్యంగా పోరాటం చేయడంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ చూపినతెగువ అజరామమని విద్యావేత్త ఎన్.శ్రీనివాసరావు అన్నారు. గురువారం నేతాజీ జయంతి సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటరు, రైలుపేట పాఠశాల వద్ద నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యోద్యమంలో నేతాజీ కృషిని వివరించారు. కార్యక్రమంలో నాళం పెదబాబు, కోటయ్య, కే.సైదులు, డాక్టర్ చిన్నమ్మ, మారుతి, నీలారెడ్డి, సురేష్, బాలిరెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కన్నాపై విమర్శలు తగదు

సత్తెనపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణపై మాజీ మంత్రి అంబటి రాంబాబు విమర్శలు చేయటం హాస్యాస్పదమని టీడీపీ పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండారు నాగరాజు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంబటి రాంబాబు నియోజక వర్గంలో వృద్ధులు, వికలాంగుల పింఛన్‌లలోనూ కమిషన్‌లు తీసుకున్నాడని, అందుకే ప్రజలు అంబటికి తగిన గుణపాఠం చెప్పారన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కన్నా చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేక తప్పుడు విమర్శలు చేస్తున్నారని మండి పడ్డారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే కన్నాలపై విమర్శలు చేస్తే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. సత్తెనపల్లి నియోజకవర్గానికి వైసీపీ తరుపున ఇన్‌చార్జిగా పని చేసేందుకు ఎవ్వరూ ముందుకు రాక పోవటంతో నరసరావుపేటకు చెందిన డాక్టర్‌ను ఇక్కడ నియమించారని బండారు నాగరాజు ఎద్దేవా చేశారు.

సమర్థవంతమైన నేత లోకేశ్

- మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి
- పల్నాడులో ఘనంగా జన్మదిన వేడుకలు
- కేక్ కట్ చేసి పంపిణీ చేసిన నేతలు
- సత్తెనపల్లిలో వెయ్యి మందికి చీరలు పంపిణీ

మాచర్లటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నాడు సుదీర్ఘ పాదయాత్రచేసి క్షేత్రస్థాయిలో ప్రజల సమస్య లను, అవసరాలను తెలుసుకొని నేడు ప్రజా నేతగా మంత్రిగా, ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తు న్న నారా లోకేశ్ సమర్థవంతమైన నేతగా మన్ననలు అందుకుంటున్నారని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం టీడీపీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను మాచర్ల పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఆయాకార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని కేక్ కట్ చేశారు. రింగురోడ్డు వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత యెనుముల కేశవరెడ్డి కేక్ కట్ చేసి చేశారు. అలాగే వెంకటేశ్వరథియేటర్, ప్రభుత్వ ఆసుపత్రి, జెండాచెట్టు, బస్టాండ్ సెంటర్, రైల్వేగేటు, నెహ్రూనగర్‌లలో కేక్‌ను కట్‌ను పార్టీ నేతలు, అభిమానులకు పంచిపెట్టారు. అలాగే మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు ఆధ్వర్యాన స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమాల్లో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, పోలూరి నరసింహారావు, మద్దిగపు వెంకట్రామిరెడ్డి, కంభంపాటి అనిల్, కజ్జం సైదయ్య, కొమెర అనంతరాములు, ఓర్సు క్రాంతి, షేక్ అన్వర్‌బాషా, కొమెర శివ, నర్రా గురవారెడ్డి, గుండాల శ్రీను, కుర్రి శివారెడ్డి, నేరేటి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురిసౌత్‌లో లోకేశ్ జన్మదిన వేడుకలను కూటమి నేతలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, డాక్టర్ ఎన్.బసివిరెడ్డి, కోటయ్య, అప్పలరాజు, సత్తిబాబు, రాహుల్, ధనుంజయరావు, మార్కు పాల్గొన్నారు.

రెంటచింతల (ఆంధ్రజ్యోతి): విద్యా, ఐటీ మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను మండల కేంద్రమైన రెంటచింతల,పాలువాయి, తుమృకోటలతో పాటు ఇతర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి లోకేశ్‌కి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు అబ్బిరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు రాజారెడ్డి, సుమంత్‌రెడ్డి, తుమ్మా జోజిరెడ్డి, రవి కిరణ్‌రెడ్డి, రామకృష్ణ, రాజ్‌కుమార్, దానయ్య, సామ్యేల్, శ్రీను, ఇన్నారెడ్డి, అప్పయ్య, ఐజాక్, ఎం.సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.


మాచర్లలో మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి, టీడీపీ నేతలు

దుర్గి, (ఆంధ్రజ్యోతి): దుర్గి బస్టాండ్ సెంటరులో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యేచూరి సునీతాశంకర్, లింగా రమేష్, చిరుమామిళ్ల కృష్ణయ్య, మాగులూరి నారయ్య, శ్రీహరి, తోటకూర శ్రీనివాసరావు, రుద్రాల రవి, సూరె వెంకటేశ్వర్లు, మేకల దాసు, సింగు నాగేశ్వరరావు, శ్రీరాం కాశీబాబు, వంకమళ్ల కోటేశ్వరరావు, ముత్తినేని పుల్లయ్య, దేవరగట్టు బ్రహ్మయ్య, ఆకుల చిన చెన్నయ్య, నాదెండ్ల శ్రీను, జక్కా రమేష్, పసుమర్తి బుజ్జి, గర్నిడి రమేష్, సూరె కృష్ణ, యెల్లెబోయిన గోపాల్, లక్ష్మణ, సిద్దయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కారంపూడి, (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో నేతలు కేక్ కట్ చేసి పంచి పెట్టారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య, మండల అధ్యక్షుడు ఉన్నం లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షులు బొల్నేడి శ్రీనివాసరావు, చప్పిడి రాము, అధికార ప్రతినిధి గోళ్ల సురేష్ యాదవ్, బీసీ కన్వీనర్లు గోరంట్ల నాగేశ్వరరావు, లింగాల శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షుడు కటికల బాలకృష్ణ, తండా మస్తాన్‌జాని, ఎస్‌పీఆర్ కృష్ణ, చావా వీరాంజనేయులు, బొల్నేడి హరికృష్ణ, షేక్ నన్నేసా, జానీబాషా, కర్నాటి మహేష్, కర్నా సైదారావు, సర్పంచ్ సరస్వతి బాలునాయక్ పాల్గొన్నారు.

వెల్దుర్తి,(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరిగిరిపాడులో తెలుగు యువత రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కుర్రి శివారెడ్డి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పులుసు శివారెడ్డి, అంజిరెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల,(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయం వద్ద టీడీపీ పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీను ఆధ్వర్యంలో కూటమి నేతలు కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్‌కి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో షేక్ బాజావలి, కనిగిరిశ్రీను, సయ్యద్ అమీర్‌అలి, వడ్డవల్లి సర్వేశ్వరరావు, సాంబశివరావు, కోటా హరి, పిల్లి చెన్నారావు, మల్లెల ఆదినారాయణ, వీవీ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ సమీపంలోని సుందరయ్య కాలనీలో, యరపతినేని లక్ష్మయ్య మెమోరియల్ పాఠశాల ఆవరణలో నల్లపాటి ధనుంజయ, దొండపాటి రాజేష్, చాట్ల సునీల్‌లు కట్‌చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రోగ్రామ్ కమిటీ సభ్యులు షేక్ సలీం, నల్లబోతుల గాలయ్య, టీడీపీ నాయకులు షేక్ జాని, మురికిపూడి నాగరాజు, గరికపాటి శంకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురజాలటౌన్, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు.

సత్తెనపల్లి, (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో కూటమి నేతలు కేక్‌ను కట్‌చేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర నేత ఎలినేడి రామస్వామి, మన్నవ శారద, నేతలు గోగినేని కోటేశ్వరరావు, సయ్యద్ పెద కరిముల్లా, ఆతుకూరి నాగేశ్వర రావు, అళ్ళ అమరేశ్వరరావు, నూర్ బాషా జానీబాబు, పోతుగంటి రామకోటేశ్వరరావు, సయ్యద్ మాబూ, పూజల వెంకట కోటయ్య, కల్లం వీరభాస్కర్‌రెడ్డి, బండారు నాగరాజు, గుంటూరు ఆశీర్వాదం, పత్తిపాటి హరేకృష్ణ, రాంబో బుడే, ఎలినేడి శ్రీనివాస్ పాల్గొన్నారు. పట్టణంలోని డాక్టర్ కోడెల కార్యాలయంలోనూ టీడీపీ నేతలు కేక్‌ను కట్ చేశారు. టీడీపీ నేత మన్నెం శివనాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెయ్యి మంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

రాజుపాలెం,(ఆంధ్రజ్యోతి): రాజుపాలెం గ్రామంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలోవున్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు మొరసా శ్రీనివాసరావు, తోట శ్రీనివాసరావు, షేక్ అల్లాబక్షు, శనగపూల నరసింహారావు, జెట్టి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి,(ఆంధ్రజ్యోతి): టీడీపీ దాచేపలి కార్యాల యంలో టీడీపీ మండల కన్వీనర్ బెల్లంకొండ బద్రియ్య కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మునగ నిమ్మయ్య, నర్రపుల్లయ్య, కొప్పుల గిరి, అక్కినపల్లి బాలయ్య, రుద్రాల అచ్చారావు, పడాల భాస్కరరావు, పర్వతనేని రామారావు, వేముల కృష్ణ, టంకం రఫీ, జనసేన నేతలు పాముల కిషోర్, బీజేపీ నేతలు కొప్పుల నాగేశ్వరరావు, బొమ్మిరెడ్డి సత్యం, నాయబ్ అబ్దుల్లా, కౌన్సిలర్ నాగరాజు, షేక్ అహ్మద, రాఘవ, వేముల కృష్ణ, జక్కిశెట్టి పున్నారావు, బొమ్మిరెడ్డి నారాయణ తవ్వా శ్రీను తదితరులు పాల్గొన్నారు.


పెదకూరపాడులో లోకేశ్ జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న టీడీపీ మండలఅధ్యక్షుడు రమేష్

పెదకూరపాడు,(ఆంధ్రజ్యోతి) : పెదకూరపాడు మండల టీడీపీ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్ ఆధ్వర్యంలో నేతలు కేక్‌ను కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఆర్ఐ మాగులూరి భాను ప్రకాష్, మాజీ ఎంపీపీ బెల్లంకొండ రామగోపాలరావు, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి బాష్యం అంజనేయులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, మండల టీడీపీ నేతలు పరుచూరి పూర్ణచంద్రరరావు, మద్దినేని వెంకట సత్యనారాయణ, మోదుల చంద్రశేఖర్, మక్కెన సాగర్, షేక్ అజ్మల్లా, జాగర్లమూడి రఘు, ఏటుకూరి బ్రహ్మయ్య, ఏటుకూరి రత్న కుమార్, గల్లా శివ నాగరాజు, గంగినేని లీలావతి, షేక్ ముంతాజ్, షేక్ మస్తాన్ షరీఫ్, మలాట్ రఫీ, షేక్ పర్వేజ్ తదితరులు పాల్గొన్నారు. గుంటూరులోని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కార్యాలయంలోనూ లోకేశ్ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

క్రోసూరు, (ఆంధ్రజ్యోతి): క్రోసూరులోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద మార్కెట్ యార్డు మాజీ చైర్మన్‌లు కాంద్రు కాశయ్య, ఏపూరి నాగేశ్వరరావులు కేక్‌ను కట్ చేశారు. విద్యార్థులకు స్వీట్లు, ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో టీడీపీ నేతలు నలజాల కోటేశ్వరరావు, పరిశ రాంబాబు, అనుముల వెంకట రామిరెడ్డి, షేక్ సలాం, దుద్దుల యోహాన్, మల్లాల రామాంజనేయులు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బెల్లంకొండ,(ఆంధ్రజ్యోతి) : స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, టీడీపీ మండల అధ్యక్షుడు నల్లమేకల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బెల్లంకొండ సర్పంచ్ జ్యోతి సముద్రం, ఎస్టీ సెల్ అధ్యక్షుడు హనుమంతరావు నాయక్, తెలుగు మహిళా అధ్యక్షురాలు నాగమణి బాయి, అక్కల వెంకట రామిరెడ్డి, గుడిసె కొండయ్య, బెల్లంకొండ మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ, వెంకటరావు, టీడీపీ నేతలు పాల్గొన్నారు. నాగిరెడ్డిపాలెంలో మండలకోర్ కమిటీ సభ్యుడు వెన్నా సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో, న్యూ చిట్యాల ఆర్‌అండ్ఆర్ సెంటర్‌లో మాజీ సర్పంచ్ హనుమంతరావు నాయక్ ఆధ్వర్యంలో, మాచాయపాలెంలో టీడీపీ నేత గుడిసె కొండయ్య ఆధ్వర్యంలో లోకేశ్ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు.

అచ్చంపేట, (ఆంధ్రజ్యోతి) :అచ్చంపేటలోని అంజనేయుని విగ్రహం సెంటర్‌లో టీడీపీ నేతలు కేక్‌ను కట్‌చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగంఆశీర్వాదం, నేతలు పాటిబండ్ల బాపిరాజు, బత్తుల శ్రీనివాసరావు, వెనిగండ్ల కోటయ్య, డీసీ చైర్మన్ పసుపులేటి పాపిరెడ్డి, గంధం కోటేశ్వరరావు, తిరువాయిపాటి ఆంజనేయులు, తాళ్ళూరి సుబ్బారావు, రాయిడి సాంబశివుడు, అన్నవరపు నాగేశ్వరరావు, టీ.విజయారెడ్డి, కొప్పురావూరి కోటేశ్వరరావు, బాలూనాయక్, చంటి పాల్గొన్నారు.


పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో మంత్రి లోకేశ్ జన్మదిన కేక్‌ను కట్‌చేస్తున్న కూటమి నేతలు


సత్తెనపల్లి టీడీపీ ప్రజా వేదికలో కేక్ కట్ చేస్తున్న ఎలినేడి రామ స్వామి, పాల్గొన్న టీడీపీ నేతలు


సత్తెనపల్లిలో మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత మన్నెం శివ నాగమల్లేశ్వరరావు, టీడీపీ నేతలు

రహదారిపై మిర్చి టిక్కీలు

- ట్రాక్టరుపై తరలిస్తుండగా జారిపడిన వైనం

దాచేపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మిరప టిక్కీల లోడుతో ప్రయాణం చేస్తున్న ట్రాక్టర్‌పై నుండి టిక్కీలు జారిపడటంతో రాష్ట్ర రహదారిపై వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గురువారం దాచేపల్లిలోని అద్దంకి-నార్కెట్‌పల్లి రాష్ట్రరహదారిలో కారంపూడి రోడ్డు సమీపంలో మిర్చి టిక్కీలు జారిపడ్డాయి. దాచేపల్లి నుంచి నడికూడిలోని శీతల గిడ్డంగికి మిరప టిక్కీలను తరలిస్తుండగా ఈ సంఘటన చోటుచేసుకుంది. ట్రాక్టరు వెనుక వస్తున్న వాహనదారులు అప్రమత్తం కావటంతో ఏ ప్రమాదం జరుగలేదు. ఈ సంఘటనపై పోలీసులు వెంటనే స్పందించి రోడ్డుపై వున్న మిరప టిక్కీలను తొలగింప చేసి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు.


బహుమతి అందిస్తున్న ఎంఈవో సత్యనారాయణ

విజేతలకు బహుమతులు

పెదకూరపాడు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : 15వ జాతీయ ఓటర్లదినోత్సవాన్ని పురస్కరించుకొని పెదకూరపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, చిత్రలేఖనం, పాటల పోటీలను నిర్వహించారు. నియోజక వర్గంలోని వివిధ మండలాల పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులు పాల్గొన్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకాణి వెంకటరమణ తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి ఎంఈవో టీ సత్యనారాయణ బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాసు నాగభూషణ రెడ్డి, దయామణి, రజియ, సత్యవతి పాల్గొన్నారు.

రహదారి పనులు ప్రారంభం

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని నెమలికల్లు నుంచి మండెపూడి వరకు రూ. 2 కోట్లతో సుమారు 2.5కి.మీ బీటీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం స్థానిక కూటమి నేతలు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ రహదారి నిర్మాణానికి కృషిచేసిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్‌కి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యడ్లపల్లి రామమోహన రావు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పరందామయ్య, ఏఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి

సత్తెనపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : సత్తెనపల్లి నియోజక వర్గంలో బీజేపీ అభివృద్ధికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఏలూరి శశికుమార్ కోరారు. గురువారం పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నియోజకవర్గ బీజేపీ నేతల, కార్యకర్తల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేతలు కట్టా శంకరరావు, కందకట్ల శంకరరావు, ఘంట విజయ కుమార్, తులసీ రామ్, షేక్ మున్వర్ బాజీ తదితరులు పాల్గొన్నారు.


భూ రికార్డులను పరిశీలిస్తున్న కెజియకుమారి

భూ రీసర్వే పనుల పరిశీలన

అమరావతి, జనవరి 23(ఆంధ్రజ్యోతి) మండల పరిధిలోని నరుకుళ్లపాడు గ్రామంలో జరుగుతున్న భూరీసర్వే పనులను ఎస్ఎస్ఎల్ఆర్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కెజియకుమారి గురువారం పరిశీలించారు. రీసర్వేలో ఏర్పడే సాంకేతిక సమస్యలను ఎలా పరిష్కరించుకోవాలన్న విషయాలను సర్వేసిబ్బందికి వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, మండల సర్వేయర్ భాగ్యలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ళు అందజేత

క్రోసూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 88 తాళ్ళూరు జడ్పీ హైస్కూల్లో చదువుతున్న ముగ్గురు పేద విద్యార్థినిలకు స్నేహహస్తాల ఫౌండేషన్ ప్రతినిధులు గురువారం సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి టీ కరిముల్లా బాబు మాట్లాడుతూ భవిష్యత్‌లో పేద విద్యార్థులకు తగిన సాయాన్ని అందించేందుకు తమ సంస్థసిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం వీ లక్ష్మీనారాయణ, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ వాసా భద్రయ్య, పాఠశాల స్థల దాత గొట్టిముక్కల బలరామకృష్ణంరాజు పాల్గొన్నారు.

త్వరలో కోడెల విగ్రహావిష్కరణ

- ఏర్పాట్లు పరిశీలించిన టీడీపీ నేతలు

సత్తెనపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని తాలూకా సెంటరులో ఏర్పాటు చేసిన మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు కాంస్య విగ్రహాన్ని త్వరలోనే ఆవిష్కరించనున్నట్లు స్థానిక టీడీపీ నేతలు తెలిపారు. గురువారం వారు విగ్రహం ఏర్పాట్లను పరిశీలించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకే ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశామని టీడీపీ నేతలు పూజల వెంకట కోటయ్య, ఆతుకూరి నాగేశ్వరరావు, సయ్యద్ పెద కరిముల్లా, అనుమోలు జయరామ్, కల్లం వీరభాస్కర్‌రెడ్డి, రాజేశ్వరి తెలిపారు.


సత్తెనపల్లి తాలూకా సెంటర్‌లో డాక్టర్ కోడెల విగ్రహావిష్కరణకు ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు


ఎమ్మెల్యే జూలకంటితో ఫాదర్ పీటర్ పాపయ్య తదితరులు

విద్యాభివృద్ధికి పునాదులు వేసిన మిషనరీ స్కూళ్లు

- ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి ● సెయింట్‌జోసఫ్ స్కూలుకి రూ.లక్ష విరాళం

వెల్దుర్తి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పల్నాడు ప్రాంతంలో విద్యాభివృద్ధికి క్రైస్తవ మిషనరీ సంస్థలు పునాదులు వేశాయని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. గురువారం రెంటచింతలకు చెందిన సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ పీటర్ పాపయ్య, పూర్వ విద్యార్థులు వెల్దుర్తి వెళ్లి ఫిబ్రవరి 7న నిర్వహించే పాఠశాల రజతోత్సవ వేడుకలకు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాఠశాలకు రూ.1 లక్ష విరాళం ప్రకటించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో తుమ్మా లూర్దురెడ్డి, సుధీర్, పాపారావు, అనిల్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, శౌరయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై

నిరసనోద్యమాలు


క్రోసూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : దేశ వ్యాప్తంగా నరేంద్రమోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలను ఖండిస్తూ నిరసనగా ఉద్యమాలకు సిద్ధం కావాలని రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు రైతులందరికీ పిలుపు నిచ్చారు. గురువారం క్రోసూరులోని అమంచి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జనవరి 26న దేశ వ్యాప్తంగా చేపట్టే నిరసనోద్యమాల్లో భాగంగా స్థానికంగా జరిగే ట్రాక్టర్, ద్విచక్ర వాహన ర్యాలీలను జయప్రదం చేయాలన్నారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జీ రవిబాబు, కౌలు రైతు సంఘం నేత తిమ్మిశెటిట హనుమంతరావు, రావిళ్ళ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

- మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎంవీఐ శేషురెడ్డి

మాచర్లటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలు నివారించవచ్చని ఎంవీఐ శేషురెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని ఎస్‌కేబీఆర్ డిగ్రీ కళాశాలలో రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ శేషురెడ్డి మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. అలాగే సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలను నడపవద్దన్నారు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మీకుమారి, ఎం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కారంపూడి, (ఆంధ్రజ్యోతి): లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంవీఐ శేషురెడ్డి అన్నారు. పట్టణంలో గురువారం ప్రైవేట్ స్కూల్ బస్సులను ఆయన తనిఖీ చేశారు. ఐదు వాహనాలపై కేసు నమోదు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.


కారంపూడిలో స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్న ఎంవీఐ శేషురెడ్డి

ఎడ్ల బల ప్రదర్శన పోస్టరు ఆవిష్కరణ

రెంటచింతల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించే ఎద్దుల బల ప్రదర్శన పోటీలకు సంబంధించి వాల్ పోస్టర్లను గురువారం కానుకమాత కోడెగిత్తల ప్రదర్శన కమిటి సభ్యులు ఆవిష్కరించారు. ఈ పోటీలలో పాల్గొనే ఎడ్ల యజమానులు 27వ తేదీ మధ్యాహ్నం నాటికి వారి పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో గొంటు సుమంత్ రెడ్డి, అల్లం ప్రతాపరెడ్డి, తుమ్మా జోజిరెడ్డి, బోడపాటి రామకృష్ణ, ఆదూరి ఇన్నారెడ్డి, కిరిటీరెడ్డి ,రాయపరెడ్డి, శౌర్రెడ్డి, అప్పయ్య, వై.జోజిరెడ్డి, మాలి రాజారెడ్డి, బుజ్జి, ఇన్నారెడ్డి, జోసఫ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కమిటి సభ్యులు






వినూత్నంగా.. సుందరంగా

బయట ఎన్ని ఒత్తిళ్ల ఎదుర్కొన్నా ఇంటికి రాగానే ప్రశాంత వాతావరణం ఉండాలని అందరూ కోరుకుంటారు. అందుకు తగ్గట్లుగానే ఇంటి వాతావరణం ఉండేలా ఒక్కొక్కరూ ఒక్కోలా అలంకరించుకుంటారు. గుంటూరు ఏటీఅగ్రహారం ఫాతిమానగర్‌కి చెందిన ఓ వ్యక్తి తన ఇంటిని వినూత్నంగా ముస్తాబు చేశారు. ఇల్లు చూడటానికి అమెరికాలోని వైట్‌హౌస్‌ను తలపిస్తూ ఉండగా, దాని ముంగిట పచ్చని పూల మొక్కలు, అందమైన కుండీలతో చూడముచ్చటగా అలంకరించారు. రైతు సాగు బడితో పొలానికి పచ్చని చీరలు కడితే ఈ ఇంటి యజమాని తీరుబడితో మొక్కలు నాటి ఇంటికి ఇలా పచ్చని రంగేసినట్లు చేసి అందరి ప్రశంసలు పొందుతున్నారు.

- గుంటూరు (ఆంధ్రజ్యోతి)

మంగళగిరి ప్రీమియర్ లీగ్ విజేత గుంటూరు

- ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్ మ్యాచ్
- ద్వితీయ స్థానంలో నిలిచిన నెల్లూరు జట్టు
- బహుమతులు అందజేసిన అంబటి రాయుడు

మంగళగిరి సిటీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవం సందర్భంగా మంగళగిరి అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో నిర్వహించిన ప్రీమియర్ లీగ్ సీజన్-3 పోటీల్లో గుంటూరు జిల్లా జట్టు విజేతగా నిలిచింది. గుంటూరు-నెల్లూరు జట్ల మధ్య జరిగిన ఫైనల్ పోరులో గుంటూరు జిల్లా జట్టు 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచిన గుంటూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. నెల్లూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 160 పరుగులు చేసి ఆలౌటయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన గుంటూరు జట్టు 18.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 161 పరుగులు చేసి ఘనవిజయం సాధించింది. 48 పరుగులు చేసి, 5 వికెట్లు తీసిన మహిప్ కుమార్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సొంతం చేసుకున్నాడు. తృతీయ స్థానం కోసం కడప-విజయనగరం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కడప జట్టు విజయం సాధించింది. 23 బంతుల్లో 50 పరుగులు చేసిన ధృవకుమార్‌రెడ్డి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ప్రతి మ్యాచ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు కింద బోగి వినోద్, కనికళ్ల చిరంజీవి సహకారంతో రూ.పదేసి వేల చొప్పున అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన కే.మహిప్ కుమార్‌కు బత్తుల హరిదాస్ రూ.50 వేలు, బెస్ట్ బ్యాటర్ ఎం.వాసుదేవరాజుకు కాసరనేని జస్వంత్ రూ.25 వేలు, బెస్ట్ బౌలర్ గిరీష్‌కు తాడిపత్రి అజయ్‌కుమార్ రూ.25 వేలు, మ్యాన్ ఆఫ్ ది కీపర్‌గా నిలిచిన సోహాస్ వర్మకు మాత్రపు జెస్సీరాజ్ రూ.15 వేల చొప్పున నగదు బహుమతులను అందజేశారు. టోర్నీలో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడికి మంత్రి నారా లోకేశ్ సహకారంతో టీషర్టులు, ప్యాంట్లు అందజేశారు.

లోకేశ్ చర్యలు భేష్ : అంబటి రాయుడు

మంగళగిరి నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మంత్రి లోకేశ్ చూపుతున్న చొరవ అభినందనీయమని భారత మాజీ క్రికెటర్ అంబటి రాయుడు తెలిపారు. ఎంపీఎల్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం అనంతరం ఆయన మాట్లాడారు. మంత్రి లోకేశ్ ఎంతో ఖర్చుతో కూడిన క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి ప్రతి ఏటా టోర్నీలు నిర్వహించడం గొప్ప విషయమన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఏపీలోనే క్రీడాకారులకు మెరుగైన వసతులు ఉన్నాయన్నారు. రాబోయే రోజుల్లో ఏపీ నుంచో ఎంతో మంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో ఆడనున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఏసీఏ కోశాధికారి దండమూడి శ్రీనివాస్, అపెక్స్ కమిటీ కౌన్సిల్ మెంబర్ దంతుగౌరు విష్ణుతేజ్, సేల్ కంపెనీ అధినేత రాఖి గిల్, సక్కు గ్రూపు అధినేత ధర్మతేజ, ఉషోదయ సంస్థ అధినేత యుగంధర్, ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ ధర్మకర్తమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి తదితరులు పాల్గొన్నారు.



విజేతగా నిలిచిన గుంటూరు జిల్లా జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న అంబటి రాయుడు

నరహంతకుడు మన్నయ్యపై పీడీ యాక్టు

- పిన్నెల్లికి ప్రధాన అనుచరుడిగా యథేచ్ఛగా నేరాలు
- హత్య, హత్యాయత్నం, రాజకీయ దాడులు.. మొత్తం 15 కేసులు


మన్నయ్య

నరసరావుపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రధాన అనుచరుడిగా హత్య, హత్యాయత్నం, రాజకీయ దాడులతో చెలరేగిపోయిన కరుడుగట్టిన నేరస్తుడైన దుర్గి మండలం జంగమేశ్వరపాడుకు చెందిన ఊరబండి మన్నయ్యపై పోలీసు శాఖ ఉక్కుపాదం మోపింది. మన్నయ్యపై పీడీ యాక్టు నమోదు చేసినట్లు ఎస్పీ కంచి శ్రీనివాసరావు గురువారం తెలిపారు. 2010 నుంచి 2024 ఎన్నికల వరకు అప్రతిహతంగా నేరాలను సాగించాడు. గత ఎన్నికల సందర్భంగా టీడీపీ వ్యక్తులపై దాడులకు తెగబడ్డాడు. మన్నయ్యపై మొత్తం 15 కేసులు ఉన్నాయి. పిన్నెల్లి అండదండలతో దుర్గి మండలాన్ని మన్నయ్య శాసించారు. దుర్గి మండలం జంగమేశ్వరపాడుకు చెందిన మన్నయ్య ఆదే గ్రామానికి చెందిన టీడీపీ నేత జల్లయ్యతో రాజీ పడినట్లుగా నమ్మించి దాడులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో జల్లయ్య హత్యకు గురయ్యాడు. ఎన్నికల సందర్భంగా పాల్వాయిగేటు, కారంపూడి, మాచర్ల పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీల్లో జరిగిన దాడుల్లో మన్నయ్య కీలకంగా వ్యవహరించాడు. ఎన్నికల ఘటనల నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి సోదరుడు వెంకట్రామిరెడ్డితో కలసి పరారయ్యాడు. ఇటీవల మాచర్ల కోర్టులో లొంగిపోయాడు. గురజాల సబ్ జైలో రిమాండ్‌లో ఉన్నాడు. ఇక్కడ కూడా సెల్ ఫోన్ వినియోగిస్తు తనిఖీల్లో దొరికాడు. జైలులో కొందరు అతడికి సహకరించారన్న ఆరోపణలున్నాయి. జైళ్ల శాఖ డీఐజీ తనిఖీల్లో మన్నయ్య అక్రమాలు వెలుగు చూశాయి. ఈ నేపథ్యంలో గురజాల జైలు నుంచి నెల్లూరు జైలుకు గత శనివారం తరలించారు. ఈ క్రమంలో ఎన్నో నేరాలకు పాల్పడిన మన్నయ్యపై పీడీ యాక్టు నమోదు జిల్లాలో సంచలనం కలిగించింది. జల్లయ్య హత్య కేసుతో పాటు దుర్గి పోలీసు స్టేషన్‌లో రెండు కేసులు, కారంపూడిలో ఎన్నికల సందర్భంగా సీఐ, టీడీపీ వర్గీయులపై దాడి, టీడీపీ కార్యాలయం ధ్వంసం సంఘటనల్లో మన్నయ్యది ప్రధాన పాత్ర. మన్నయ్యపై 302 సెక్షన్ కింద కారంపూడి స్టేషన్‌లో కేసు నమోదైంది. దుర్గి పోలీసు స్టేషన్‌లో దాదాపు ఎనిమిది, మాచర్ల పట్టణ పోలీసు స్టేషన్‌లో రెండు కేసులు నమోదయ్యాయి. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఎస్పీ హెచ్చరించారు. మన్నయ్య లాంటి నేరగాళ్లను అణిచివేస్తామన్నారు.

కోటికి పైగా టీడీపీ సభ్యత్వాలు లోకేశ్ జన్మదిన కానుక

- టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ రక్తదాన శిబిరం ఏర్పాటు అభినందనీయం
- రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివారావు


రక్తదాన శిబిరాన్ని సందర్శించిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, మాజీ మంత్రి ఆలపాటి రాజా తదితరులు

తుళ్లూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి) కోటికి పైగా టీడీపీ సభ్యత్వాల నమోదు జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారా లోకేశ్ జన్మదిన కానుకని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. గురువారం నేలపాడు హైకోర్టు దగ్గర్లో రాష్ట్ర టీడీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని, వైద్య శిబిరాన్ని పల్లా తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, మాజీ మంత్రి ఆలపాటి రాజా, ఎమ్మెల్సీ అశోక్‌బాబు, టీడీపీ రాష్ట్ర నాయకుడు గొట్టిపాటి రామకృష్ణ సందర్శించారు. ఎన్టీఆర్ విగ్రహా నికి పూలదండలు వేసి నివాళి అర్పించిన అనంతరం లోకేశ్ జన్మదిన కేక్‌ను వారు కత్తిరించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, సంక్షేమం అభివృద్ధితో పాటు కార్యకర్తల సంక్షేమం కోసం లోకేశ్ కృషి చేస్తున్నారని తెలిపారు. టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ మూడవ సంవత్సరం లోకేశ్ జన్మదినం సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ప్రజా సేవే పరమావధిగా పని చేస్తున్న ఏకైకపార్టీ తెలుగుదేశం పార్టీ అని పల్లా పేర్కొన్నారు. లోకేశ్‌కు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని ప్రచారం సాగటంపై ఆయనను అడగగా దానికి అధిష్ఠానం ఫుల్‌స్టాప్ పెట్టిందన్నారు. ఎవరూ దాని మీద కామెంటు చేయటానికి వీల్లేదన్నారు. అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యమన్నారు. రమేష్ హాస్పటల్స్ వారి సహకారంతో న్యాయవాదులు పారా కిషోర్, దాసరి రవీంద్ర కృషితో జరిగిన రక్తదాన శిబిరం కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు, యువత ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు, రైతు ఉపాధ్యక్షుడు నూతలపాటి రామారావు, తుళ్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, స్థానిక టీడీపీ నాయకులు కాటా అప్పారావు, జొన్నలగడ్డ కిరణ్ బెల్లంకొండ నరసింహారావు, బండ్ల పట్టాభిరామయ్య, జమ్ముల అనిల్, మూల్పూరి శ్రీనివాసరావు, కొమ్మినేని కోటేశ్వరావు, చిలుకూరి వెంకటరెడ్డి, సాహెబ్ జాన్, మాబు సుబాని, తరగోపుల సాంబశివరావు, పాలకాయల గోపాల్రావు, పోతురాజు శ్రీనివాసరావు, కారుమంచి నరేంద్ర, టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రెసిడెంట్ పోసాని వెంకటేశర్లు , అడ్వకేట్ జనరల్ దమ్మాల పాటి శ్రీనివాస్, పీపీ ఎం. లక్ష్మీనారాయణ, సభ్యులు ఎం.మోహన్ రావు, పలువురు హైకోర్టు న్యాయవాదులు పాల్గొన్నారు.

రెవెన్యూ, పోలీసు అధికారులకు ఈసీ అవార్డులు

గుంటూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): 2024 ఎన్నికల సందర్భంగా ఉత్తమ విధానాలను అవలంబించిన పలువురు రెవెన్యూ, పోలీసు అధికారులకు ఎన్నికల సంఘం అవార్డులు ప్రకటించింది. తాడేపల్లి తహసీల్దార్, ఏఈఆర్‌వో అయిన డీ సీతారామయ్య, మంగళగిరి నియోజకవర్గంలోని బీఎల్‌వోలు ఎం గణేష్, దేవరకొండ మాధవిలతకు ఈసీ అవార్డులకు ఎంపిక చేసింది. ఈ నెల 25వ తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలో ఈ అవార్డులను ప్రదానం చేయనున్నారు. దీని దృష్ట్యా ఆయా అధికారులను కార్యక్రమానికి పంపించాలని చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్‌యాదవ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

వర్సిటీ వీసీల నియామక నిబంధనలు మార్చటం నిరంకుశం

గుంటూరు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీల వైస్ చాన్సలర్ల నియామకంపై గవర్నర్లకు పూర్తి అధికారం కల్పిస్తూ యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ జారీ చేసిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్ రాష్ట్రాల హక్కులకు పాతరవేయటమేనని అవగాహన సంస్థ ఖండిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో ఆక్షేపించారు. ఈ నోటిఫికేషన్ ద్వారా ఊహించటానికి కూడా సాధ్యం కాని మార్పులను కేంద్ర ప్రభుత్వం తలపెట్టిందని ఆందోళన వ్యక్తం చేశారు. వాటిల్లో ముఖ్యమైనది వైస్ చాన్సలర్ల నియామక నిబంధనలను పూర్తిగా మార్చటానికి ప్రతిపాదించటం ఒకటన్నారు. ఇప్పటివరకు ఉన్న రాష్ట్ర ప్రభుత్వపాత్రను పూర్తిగా తొలగించటంతో పాటు అన్ని అధికారాలను గవర్నర్లకు అప్పగించాలని పేర్కొనటంతో పాటు వైస్‌చాన్సలర్‌ల ఎంపికకు సంబంధించిన విద్యాపరమైన అర్హతలను సడలించటం జరుగుతుందన్నారు.

నేడు మిర్చి వ్యాపారస్థుల నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం

గుంటూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ది గుంటూరు చిల్లీస్ కమీషన్ ఏజంట్స్ అసోసియేషన్ నూతన పాలకవర్గం శుక్రవారం ప్రమాణ స్వీకారం చేయనుంది. లాలుపురం వై జంక్షన్ సమీపంలోని వీఆర్‌కే గార్డెన్స్‌లో నేటి ఉదయం 11.30 గంటల నుంచి పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుందని అసోసియేషన్ అధ్యక్షుడు దాది నరేంద్రబాబు తెలిపారు. సంఘం ఉపాధ్యక్షుడిగా జంగా నర్సిరెడ్డి, కార్యదర్శిగా ముక్కాల విజయభాస్కర్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీగా ఏ రవికుమార్, ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారని, ఈ కార్యక్రమానికి వ్యాపారస్థులంతా హాజరు కావాలని ఆయన గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.


త్రిఫ్ట్‌కు లిఫ్ట్!

- చేనేత కార్మికుల పొదుపునకు ప్రోత్సాహం
- డిపాజిట్‌కు రెండు రెట్లు అదనపు సాయం
- పథకాన్ని పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు జారీ

సత్తెనపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): చేనేత రంగాన్ని అభివృద్ధి చేయాలని సంకల్పించిన కూటమి ప్రభుత్వం కార్మికులకు ఊతమిచ్చే త్రిఫ్ట్ పథకాన్ని పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నేతన్నలు తమకు వచ్చే ఆదాయంలో ఎనిమిది శాతాన్ని డిపాజిట్ చేస్తే దానికి 16 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం కలుపుతుంది. 90 రోజుల్లో ఆ మొత్తం చేనేత కార్మికులకు అందుతుంది. నేతన్నల పొదుపును ప్రోత్సహించేందుకు ఏర్పాటు చేసిన ఈ పథకాన్ని గత ప్రభుత్వం విస్మరించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే నేతన్నల సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు చేపట్టింది. త్రిఫ్ట్ పథకం 2014 నుంచి 2019 వరకు అమలైంది. ప్రతి చేనేత సహకార సంఘంలో ఈ పథకంలో వంద మంది వరకు నమోదయ్యారు. ఆర్థికంగా లబ్ధి పొందారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పథకాన్ని నిలిపి వేసింది. చేనేత సొసైటీలకు ఎన్నికలు పూర్తయ్యాక లబ్ధిదారుల ఎంపిక సైతం ప్రారంభం కానుంది. చేనేత సొసైటీల ఎన్నికల నిర్వాహణకు కూటమి ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. వివిధ కారణాలతో జాప్యం జరుగుతుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి జిల్లాలో 25 సహకార సంఘాల పరిధిలో నాలుగు వేల మంది సభ్యులు ఉన్నారు. ఇప్పుడు 12 సంఘాలే కార్యకలాపాలు సాగిస్తున్నట్టు తెలిసింది. జిల్లాలో రెండు వేల కుటుంబాలు మాత్రమే మగ్గాలపై పని చేస్తున్నట్టు సమాచారం. గత ఐదు సంవత్సరాల్లో పరిణామాలు కూడా చేనేత వృత్తిదారులు తగ్గటానికి ఒక కారణంగా కన్పిస్తుంది. ప్రధానంగా పట్టు, నూలు వంటి ముడి సరుకులపై కేంద్ర ప్రభుత్వం రాయితీ ఎత్తి వేసింది. నూలు, రంగులు, రసాయనాలపై కేంద్ర ప్రభుత్వం 18 శాతం జీఎస్టీని విధించింది. అటు వైసీపీ హయాంలో చేనేత హస్తం అన్న పథకం తప్పించి సహకార సంఘాలకు ఎటువంటి సాయం చేయలేదు. ఆప్కో బకాయిలు కూడా చెల్లించలేదు. గతంలో ప్రభుత్వాలు రాయితీపై బ్యాంక్ రుణాలు ఇచ్చేవి. మగ్గాలు ఇతరత్రా పరికరాలు అందించేవి. చేనేత కార్పొరేషన్ ద్వారా విరివిగా రుణాలు ఇచ్చేవి. కూటమి ప్రభుత్వం కూడా చేనేత సహకార సంఘాలకు జవసత్వాలు నింపాలని భావిస్తుంది. గతంలో మాదిరిగా ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. తద్వారా సొసైటీల్లో సభ్యులు క్రియాశీలకమవుతారని అంచనా వేస్తుంది. తరువాత త్రిఫ్ట్ పథకం అమలు చేస్తే లబ్ధిదారులు పెరుగుతారని అభిప్రాయ పడుతుంది.

చేనేత శాల ఏర్పాటుకు నిర్ణయం

మంత్రి నారా లోకేశ్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరిలో చేనేత కార్మికులు అధికం. లోకేశ్ చొరవతో అక్కడ చేనేత శాల ఏర్పాటు చేశారు. అటువంటి చేనేతశాలను పల్నాడు జిల్లాలో కూడా ఏర్పాటు చేస్తారని తెలుస్తుంది. ఇంటి వద్ద మగ్గం ఏర్పాటు చేసుకోలేక పోయిన వారికి చేనేతశాలలో ఉపాధి లభిస్తుంది. చేనేత శాలలో మగ్గాలపై అనుభవం ఉండి సొసైటీల్లో సభ్యత్వం కలిగిన వారందరికీ ఉపాధి కల్పిస్తారు. చేనేత కుటుంబాల్లో టైలరింగ్ చేసే వారికి వస్త్రాల కుట్టుపని అప్పగిస్తారు. అవగాహన లేకపోతే నైపుణ్య కేంద్రం ద్వారా శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తారు.



చేనేత కార్మికులు

కెమికల్ వేస్ట్ వ్యాపారం పేరుతో.. రూ.15 కోట్ల డిపాజిట్లు వసూళ్ళు

- నిందితుడి అరెస్టు

గుంటూరు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : తనకున్న దురలవాట్లకు తోడు ఈజీ మనీకి అలవాటు పడి కెమికల్ వేస్ట్ వ్యాపారం అంటూ కోట్లు వసూల్ చేసి మోసం చేసిన యువకుడిని అరండల్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు గురువారం అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెస్ట్ డీఎస్పీ అరవింద్ నిందితుడు అనిల్ కుమార్‌ను మీడియా ఎదుట హాజరుపరిచి వివరాలు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే...గుంటూరు నగరంలోని రాజీవ్‌గాంధీనగర్ 3వ లైనుకు చెందిన రాజుపాలెం రమేష్‌కి ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్న పెదకూరపాడుకు చెందిన పమిడిపల్లి అనిల్‌కుమార్ స్నేహితుడు. అయితే తాను కెమికల్ వేస్ట్ బిజినెస్ చేస్తున్నానని, సదరు వ్యాపారంలో పెట్టుబడులు పెడితే ఎక్కువ మొత్తంలో లాభాలు వస్తాయని మాయ మాటలు చెప్పినమ్మించాడు. ఈ క్రమంలో రమేష్‌తో పాటు తనకు తెలిసిన వారి వద్ద సుమారు 15 కోట్ల రూపాయలు డిపాజిట్ల రూపంలో వసూలు చేశాడు. లక్ష పెట్టుబడి పెడితే వారికి రెండు నెలల్లోనే లక్షన్నర ఇస్తానంటూ నమ్మించేవాడు. వారికి నమ్మకం కల్పించేందుకు మొదట్లో ఎక్కువ మొత్తంలో వారి ఖాతాకు జమ చేస్తూ ఉండేవాడు. ఆ విధంగా నమ్మకం కలగడంతో వారు కోట్లలో పెట్టుబడులు పెట్టేవారు. ఈ విధంగా వసూలు చేసిన మొత్తాన్ని దారి మళ్ళించాడు. ఇలా సుమారు 32 మంది నుంచి డిపాజిట్ల రూపంలో అనిల్‌కుమార్ రూ. 15 కోట్లు వసూలు చేశాడు. వారికి నమ్మకం కలిగించే క్రమంలో సుమారు రూ. 9 కోట్లు వరకు వెనక్కు వారి ఖాతాకు జమ చేశాడు. కాగా మోసపోయిన బాధితుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దీనిలో భాగంగా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు వెస్ట్ డీఎస్పీ అరవింద్ ఆధ్వర్యంలో అరండల్‌పేట సీఐ వీరాస్వామి నిందితుడు అనిల్‌కుమార్‌ను అరెస్ట్ చేశారు. నిందితుడు గతంలో గుంటూరులో ఒక కళాశాలలో చదువుకుని, హైదరాబాద్‌కి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. అనంతరం హైదరాబాద్‌లోని సన్ సిటీలో నివసిస్తూ కొంత కాలం కెమికల్ ఫ్యాక్టరీలో ఉద్యోగిగా పని చేశాడు. ఎలాగైనా ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ముందుగా తన స్నేహితుల వద్ద కొంత డబ్బు తీసుకొని శానిటైజర్ల వ్యాపారం చేయగా సదరు వ్యాపారంలో నష్టం వచ్చింది. చెడు వ్యసనాలకి బానిసయ్యాడు. ఆ అప్పులు తీర్చటానికి, అంతేగాకుండా తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో రమేష్ వద్ద, అతనికి తెలిసిన వారి వద్ద ఎస్ఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీ, కెమికల్ రీసైకిలింగ్, కెమికల్ వేస్టేజ్‌లో డబ్బులు పెట్టుబడిగా పెడితే ఎక్కువ లాభాలు ఇస్తాను అని మాయ మాటలు చెప్పాడు. వారి వద్ద నుంచి డబ్బులు తీసుకొని మొదటి విడత ఇచ్చిన డబ్బులకి ఎక్కువ డబ్బులు లాభంగా ఇచ్చి వారికి నమ్మకం కలిగించాడు. ఇప్పటి వరకు సుమారు 32 మంది వద్ద నుంచి ఎక్కువ మొత్తంలో అంటే సుమారు 15 కోట్ల రూపాయల డబ్బులు వసూలు చేశాడు. పలువురిని మోసగించిన కేసులో పమిడిపల్లి అనిల్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇంకా ఈ కేసులో బాధితులు ఉన్నట్టు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న వెస్ట్ డీఎస్పీ అరవింద్, అరండల్‌పేట సీఐ వీరాస్వామి, వెనుక నిందితుడు అనిల్‌కుమార్

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

మోడల్ పాఠశాలలో సామాజిక తనిఖీ

రొంపిచర్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెం పీఎంశ్రీ మోడల్ పాఠశాలలో గురువారం సామాజిక తనిఖీ, గ్రామ సభ జరిగింది. పాఠశాలలో జరిగిన సదుపాయాలను, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం, సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం, ఇతర పథకాలను పరిశీలించారు. హాస్టల్‌లో ఉన్న రిజిస్టర్లను, రికార్డులను పరిశీలించి గ్రామ సభలో చర్చించారు. ఎస్ఎస్ఏ ఏటీ ఏపీ కమిటీ, ఎస్ఎంసీ సమక్షంలో జరిగింది. తనిఖీ అధికారి కిషోర్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను పిల్లల ద్వారా రహస్యంగా సేకరిస్తామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని తెలిపారు.

రోటరీ ఆరోగ్య కేంద్రానికి రూ.1.2 లక్షల విలువైన మందుల వితరణ

చిలకలూరిపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట రోటరీ ఉచిత ఆరోగ్య కేంద్రానికి శ్రీశైలం కాకతీయ అన్నసత్ర సంఘం కోశాధికారి ముత్తినేని వెంకటేశ్వర్లు గురువారం రూ.1.2 లక్షల విలువగల మందులు విరాళంగా అందచేశారు. రోటరీ క్లబ్ వారు ఈ కేంద్రం ద్వారా నిరుపేదలకు ప్రతిరోజు ఉచిత వైద్య సేవలతో పాటు ఉచితంగా మందులు అందచేస్తున్నారు. రోటరీ 3150 జిల్లా గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముత్తినేని వెంకటేశ్వర్లుతోపాటు రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ఆళ్ళ వేమన రెడ్డి, ఉప్పుటూరి ప్రసాద్, క్లబ్ సభ్యులు గళ్లా సాంబశివరావు, తోటకూర వెంకటనారాయణ, చిలుకూరి శ్రీనివాస్, టి.వెంకటేశ్వరరావు, సి.చంద్రశేఖరరావు, హరిదాసుల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన

చిలకలూరిపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 22వ వార్డులో రూ.13లక్షల వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీరోడ్లు, డ్రెయిన్‌ల నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ ప్రజలు పరిసరాల పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జి తోట రాజా రమేష్, మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరి బాబు, డీఈ అబ్దుల్ రహీం, టీడీపీ నాయకులు షేక్ కరిముల్లా, పఠాన్ సమద్ ఖాన్, మద్దుమాల రవి, కౌన్సిలర్ కూనల ప్రమీల పాల్గొన్నారు.

అనారోగ్యంతో పారిశుధ్య కార్మికుడి మృతి

చిలకలూరిపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డైక్‌మెన్ నగర్‌కు చెందిన రెండో డివిజన్ పారిశుధ్య కార్మికుడు జి.ఏసురత్నం (35) అనారోగ్యంతో మృతి చెందాడు. మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరి బాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుజాత, సీపీఐ నాయకులు తాళ్లూరి బాబురావు, చెరుకుపల్లి నిర్మల ఏఐఎస్ఎఫ్ నాయకులు సుభాని, మున్సిపల్ యూనియన్ నాయకులు కె. చెంచయ్య, అంజయ్య, పారిశుధ్య కార్మికులు గురువారం ఏసురత్నం మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఆట స్థలం ప్రారంభం

రొంపిచర్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిపాలెంలోని పీఎంశ్రీ మోడల్ పాఠశాల నిధులతో అభివృద్ధి చేయించిన రన్నింగ్ ట్రాక్, కబడ్డీ కోర్టులను ప్రిన్సిపల్ రవి నాయక్ గురువారం ప్రారంభించారు. ఎస్ఎంసీ చైర్మన్ రామిరెడ్డి, కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

పోటీల్లో వెల్లటూరు విద్యార్థుల ప్రతిభ

బొల్లాపల్లి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వాటర్ దినోత్సవం సందర్భంగా నియోజకవర్గ స్థాయిలో శావల్యాపురం జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన పోటీల్లో వెల్లటూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి ఎం.లీలానాయక్ పాటల పోటీల్లో ప్రథమ బహుమతి సాధించగా, డిబేట్‌లో ద్వితీయ బహుమతి, వ్యాస రచన పోటీల్లో తృతీయ బహుమతి సాధించారు. అమృత వ్యాస రచన పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించింది.

జిల్లాస్థాయి పోటీలకు వేల్పూరు విద్యార్థులు ఎంపిక

శావల్యాపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వ్యాసరచన, వక్తృత్వం, పాటలు, లఘునాటిక పోటీల్లో శావల్యాపురం మండలం వేల్పూరు జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభను కనబరచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం మహబూబ్ సుభానీ గురువారం తెలిపారు. శావల్యాపురం జడ్పీపాఠశాల్లో నిర్వహించిన వ్యాసరచనలో మర్రి శ్రీవల్లి, వక్తృత్వంలో జ్యోతి స్వామివివేకానంద ప్రథమస్థానం, పాటల విభాగంలో యారం హేమలత, లఘునాటికలో సాయికృష్ణటీం ద్వితీయ స్థానాలను సాధించి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. శుక్రవారం నర్సరావుపేటలో జరగనున్న జిల్లాస్థాయి పోటీల్లో వీరంతా పాల్గొంటారన్నారు.

రైతుల సాయంతోనే రీ సర్వే సాధ్యం

నూజెండ్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే యజ్ఞం రైతుల సహాయ సహకారాలతోనే సాధ్యమని తహసీల్దార్ జీ రమేష్ కుమార్ అన్నారు. మండలంలోని త్రిపురాపురంలో రీ సర్వే ప్రారంభించిన సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి రైతుల అనుమానాలు, అపోహలను గురువారం నివృత్తి చేశారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ చండీరాణి, డిప్యూటీ తహసీల్దార్ బాల వెంకటేశ్వర్లు, వినుకొండ మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ అనుమోలు సుబ్బారెడ్డి, తలారి ఆంజనేయులు, అప్పిరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● కొత్తలూరు (శావల్యాపురం): భూ వివాదాలను పరిష్కరించి రైతులకు శాశ్వత భూ హక్కును కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన రీసర్వేను రెవెన్యూ, సర్వేసిబ్బంది పారదర్శకంగా నిర్వహించాలని రీ సర్వే నోడల్ ఆఫీసర్ రాజశేఖర్ అన్నారు. కొత్తలూరు రెవెన్యూ పరిధిలో జరుగుతున్న రీసర్వే ప్రక్రియను ఆయన డీఐవో వెంకటేశ్వర్లుతో కలిసి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రీ సర్వేపై రైతు లకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించి పొరబాట్లకు తావులేకుండా నిర్వహించాలన్నారు.

కత్తవ చెరువు.. కబ్జా

● రెండు ఎకరాలకుపైగా ఆక్రమణ
● చోద్యం చూస్తోన్న మైనర్ ఇరిగేషన్ శాఖ
● చెరువు స్థలం సర్వే చేయించిన మున్సిపాల్టీ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నరసరావుపేట సత్తెనపల్లిరోడ్డులో 64.21 ఎకరాల్లో కత్తవ చెరువు ఉంది. వైసీపీ హయాంలో అధికారం అండతో చెరువు స్థలాన్ని కబ్జా చేశారు. చెరువు స్థలంలో కబ్జాదారులు అక్రమ నిర్మాణాలు కూడా చేపట్టారు. మున్సిపాల్టీ చెరువును సర్వే చేయించగా రెండు ఎకరాలకు పైగా స్థలాన్ని కబ్జా చేసినట్లు తేలింది. ఆక్రమణలపై సర్వే నివేదికను మున్సిపాల్టీ ఆర్డీవోకు అందజేసింది. మైనర్ ఇరిగేషన్ శాఖ నిర్వహణలోని చెరువును రాజకీయ అండతో అక్రమార్కులు కబ్జా చేస్తున్నారు. చెరువు స్థలంలో పట్టాలు ఇవ్వకూడదన్న నిబంధన ఉంది. అయినా 10.64 ఎకరాల్లో పట్టాలు ఇచ్చినట్లు తేలింది. జారీ చేసిన ఇళ్ల పట్టాలను అధికారులు పరిశీలిస్తున్నారు. స్థలంలో ఆక్రమణలను తొలగించేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. పట్టాల్లో కొన్ని నకిలీవి ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తెలినట్లు సమాచారం.



కత్తవ చెరువు స్థలం కబ్జా చేసి వైసీపీ నేత చేసిన అక్రమ నిర్మాణం

చిన్నారులను బడికి పంపిస్తాం

● తహసీల్దార్ సురేష్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



చిన్నారుల వివరాలను తెలుసుకుంటున్న తహసీల్దార్ సురేష్

వినుకొండ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటప్పనగర్ సమీపంలోని చెరువు గట్టుపై గత కొంతకాలంగా నివాసం ఉంటున్న నిరుపేద కుటుంబ నివాస ప్రాంతాలను తహసీల్దార్ సురేష్ గురువారం సందర్శించారు. ఆ ప్రాంతంలో నివాసం ఉంటున్న సుమారు 20కుటుంబాలకు చెందిన 40మంది చిన్నారులపై ఆంధ్రజ్యోతిలో వెలువడిన 'బడి చూడని బాల్యం' అనే కథనంపై అధికారులు స్పందించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ చెరువుగట్టుపై నివాసం ఉంటున్న పేద నివాస ప్రాంతాలను సందర్శించి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ నుంచి వచ్చారు ఎంత కాలం నుంచి నివాసం ఉంటున్నారు, రేషన్‌కార్డుతోపాటు ఆధార్‌కార్డులు ఉన్నాయా అని వారిని అడిగి తెలుసుకున్నారు. పనులు కోసం వచ్చామని ప్రకాశం జిల్లా ఒంగోలు నుంచి 8 సంవత్సరాల క్రితం వలస వచ్చి ఇక్కడే జీవనం సాగిస్తున్నామని స్థానికులు తహసీల్దార్‌కు తెలిపారు. పుట్టిన తేదీ సర్టిఫికెట్‌లు లేకపోవడంతో తమకు కాని, తమ పిల్లలకు కాని ఆధార్ కార్డు, రేషన్‌కార్డులు లేవని తెలియజేశారు. ఎంఈవో జప్రుల్లా, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి అనురాధలకు తహసీల్దార్ సురేష్ ఫోన్‌చేసి వారికి సాయం అందించాలని ఆదేశించారు. తహసీల్దార్ వస్తున్నారన్న సమాచారం మేరకు కంచర్ల ఎస్సీ కాలనీ ప్రధానోపాధ్యాయుడు యు.సాంబయ్య, ఉపాధ్యాయులు సత్యనారాయణ ఆ ప్రాంతానికి చేరుకొని 16మంది పిల్లలను తమ పాఠశాల్లో పేర్లు నమోదు చేయించామని, పాటశాల నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉండటంతో వారంతా బడికి రావడం లేదన్నారు. అంతేకాకుండా ఆధార్‌కార్డులు లేకపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చిన దుస్తులు, పుస్తకాలు అందించలేకపోయామని తహసీల్దార్‌కు వివరించారు. రానున్న మూడు నెలల వ్యవధిలో పిల్లలను సమీపంలోని కోటప్పనగర్ లేదా హస్సనాయునిపాలెం ప్రభుత్వ పాఠశాలకు ఆటోల సాయంతో పాఠశాలకు పంపేలా చూడాలని ఉపాధ్యాయులను కోరారు.

పిల్లలకు పుట్టిన తేదీ సర్టిఫికెట్ వచ్చేలా జిల్లా కలెక్టర్ సూచనలు మేరకు అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. పనులకు వెళ్ళిన కుటుంబ సభ్యులను విచారించి అందరికీ న్యాయం జరిగే లా చూస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆర్ఐ శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా లోకేశ్ జన్మదిన వేడుకలు



చిలకలూరిపేటలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు చిలకలూరిపేటలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ప్రత్తిపాటి స్వయంగా బుల్లెట్ నడిపి పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచారు. లోకేశ్ ఫేస్ మాస్కులతో పార్టీ శ్రేణులు కార్యక్రమాలలో పాల్గొన్నారు. పట్టణ టీడీపీ కార్యాలయంలో ప్రత్తిపాటి కేక్ కట్ చేశారు. అనంతరం అన్నదానం, సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ అరాచకాలపై అన్నివర్గాల ప్రజలను యువగళం యాత్రతో లోకేశ్ ఏకం చేశారన్నారు. దేశంలో ఏ రాజకీయ పార్టీకి లేనివిధంగా టీడీపీ సభ్యత్వాలు కోటికి చేరడం వెనుక లోకేశ్ పాత్ర ఎంతో ఉందన్నారు.

● వినుకొండ: రాజకీయ నాయకత్వానికి మానవత దృక్పథాన్ని అద్ది అందరి మన్ననలు అందుకున్న అరుదైన నాయకుడు మంత్రి లోకేశ్ అని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని కితాబిచ్చారు. లోకేశ్ జన్మదినం సందర్భంగా ప్రభుత్వ వైద్యశాలలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీచేశారు. అనంతరం విఠంరాజుపల్లి సమీపంలోని సెయింటాన్స్ ఉషోదయ మానసిక వికలాంగుల పాఠశాల్లో పుట్టినరోజు వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. అనంతరం పిల్లలతో కలిసి అన్నదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతోపాటు మండల పార్టీ సీనియర్ నాయకులు యరమాసు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● మతుకుమల్లి (శావల్యాపురం): రాష్ట్ర మానవవనరులు, ఐటీ, మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను మండలంలోని మతుకుమల్లిలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ మాజీ రాష్ట్ర పరిశీలకులు, మాజీ సర్పంచ్ ముండ్రు హనుమంతరావు పాల్గొని లోకేశ్ చిత్రపటం వద్ద జన్మదిన కేకును కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ పులుకూరి శ్రీనివాసరావు, హెచ్ఎం శ్రీనివాసమూర్తి, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, నేతలు తోట రమేష్, కొండారు అనిల్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీచేస్తున్న చీఫ్‌విప్ జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన

● నరసరావుపేట టౌన్: నరసరావుపేట పట్టణ టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ 42వ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు డాక్టర్ చదలవాడ ఆదిత్య బాబు ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: పట్టణ టీడీపీ జిల్లా కార్యాలయంలో టీడీపీ జాతాయ కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడులకు గురువారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నల్లపాటి రామచంద్రప్రసాదు, టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సాతులూరి కుమార్, నాయీ బ్రాహ్మణుల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, గొట్టిపాటి జనార్దన్‌బాబు, షేక్ మన్నాన్ షరీఫ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టా కిరణ్, పల్నాడు జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు కుమ్మెత కోటిరెడ్డి, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి హనుమంతరావు, శాఖమూరి మారుతి తదితరులు పాల్గొన్నారు. కోటలోని డాక్టర్ కోడెల శివ ప్రసాదరావు ఆసుపత్రిలో టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో మందాడి రవి, కొక్కిరాల శ్రీనివాసరావు, కసిందుల హరిబాబు, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● ఈపూరు: నారా లోకేష్ జన్మదినం సందర్భంగా ముప్పాళ్ల, అంగలూరు గ్రామాల్లో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు, టీఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు నర్రా కిశోర్‌లు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో విడపలపాటి హనుమయ్య, సర్పంచ్ గోనుగుంట్ల శ్రీనివాసరావు, పులుకూరి వెంకట్రావు, పాపారావు, దండే కోటేశ్వరరావు, గోగుల సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: మండలంలోని సంగినీడుపాలెంలో లోకేశ్ జన్మదినం సందర్భంగా భారీ కేక్‌ను కట్‌ను టీడీపీ నాయకులు తిప్పిశెట్టి వెంకటేశ్వర్లు, బాదరయ్య, ఎర్ర శ్రీను కట్ చేశారు. రాత్రి భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



కేక్ కట్ చేస్తున్న గోనుగుంట్ల కోటేశ్వరరావు, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు తదితరులు



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ చదలవాడ అదిత్యబాబు, తదితరులు

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

వినుకొండ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని రాష్ట్ర స్వయం సేవక్ సంఘ నాయకులు గురువారం పట్టణంలోని బోసు బొమ్మ సెంటర్‌లో బోస్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆర్ఎస్ఎస్ గుంటూరు విభాగ్ వ్యవస్థ ప్రముఖ్ వక్త కొత్తమాసు రవి, యిమ్మడిశెట్టి మల్లికార్జున, గట్టుపల్లి కాశి, ఐతా రామారావు, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మిత్తంటి కృష్ణాంజనేయులు, దేవతి పెద నరసింహారావు, కొల్లిపర నాగేశ్వరరావు, కొప్పురావూరి కోటేశ్వరరావు, బండి వెంకటేశ్వర్లు, గోరంట్ల లక్ష్మీరాజేష్ తదితరులు పాల్గొన్నారు.

● ఈపూరు: ఈపూరు శాఖా గ్రంథాలయంలో గురువారం స్వాతంత్ర్య సమర యోధుడు, ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు సుభాష్ చంద్రబోస్ 127 జయంతిని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి గంటా శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

● నూజెండ్ల: మండలంలోని పెద్దవరం ప్రభుత్వ పాఠశాలలో గురువారం నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా పరాక్రమ దివస్‌ను నిర్వహించారు. రాత పోటీలు నిర్వహించి పాఠశాల హెచ్ఎం నాగేశ్వరరావు బహుమతులు అందజేశారు.

● నరసరావుపేట టౌన్: స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాతాని వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ ఎంఆర్‌కే సతీష్‌బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ యోగేశ్వరరావు, జే మల్లారెడ్డి, కే అప్పర, శివుడు, జే మల్లేశ్వరి, కే శ్రీదేవి, వీ రజిని, ఎస్‌కే మేరాబి, కే బాజీ, ప్రభుదాసు, కేఎంఎల్ ప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట టౌన్: పట్టణంలోని నరసరావుపేటలోని సుభాష్ చంద్రబోసు విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం నివాళులర్పించారు. ఆయన జయంతిని పురస్కరించుకొని ఆ పార్టీ నాయకులు మాజీ మునిసిపల్ వైస్ రామకోటేశ్వరరావు, సమన్వయకర్త రాధాకృష్ణ, నాయకులు గోవిందు శంకర శ్రీనివాస్, కోటేశ్వరరావు, ఖాజాబుడే తదితరులు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

బాధ్యతాయుతంగా పని చేయకుంటే చర్యలు: జీవీ

వినుకొండ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అధికారులు బాధ్యతాయుతంగా పని చేయకుంటే చర్యలు తప్పవని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. గురువారం వినుకొండలోని కార్యాలయంలో పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ పంచాయతీ నిధులను అభివృద్ధి కార్యక్రమాలకు వెచ్చించాలన్నారు. ప్రతి పంచాయతీలో కార్యదర్శిని నియమిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ రాజ్ అధికారులు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్‌డీలు పాల్గొన్నారు.

మావోయిస్టులతో చర్చలు జరపాలి: పీడీఎం

నరసరావుపేట టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): దండకారణ్యంలో భద్రత బలగాల దాడులు నిలుపుదల చేసి, మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని పీడీఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఎన్జీవో కాలనీలో విలేకరులతో మాట్లాడుతూ భద్రతా బలగాల క్యాంపులు ఏర్పాటుచేసి ప్రజలను పెద్దఎత్తున భయప్రాంతాలకు గురిచేస్తున్న చర్యలను ప్రజలు, ప్రజాస్వామికవాదులు తీవ్రంగా ఖండించాలన్నారు. సమావేశంలో పీడీఎం రాష్ట్ర నాయకుడు వై వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జిల్లా కార్యదర్శి జీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సుదర్శన వ్యాఖ్య గ్రంథావిష్కరణ

నరసరావుపేట కల్చరల్, జనవరి, 23 (ఆంధ్రజ్యోతి) ప్రకాష్‌నగర్‌లోని శృంగేరి శంకరమఠంలో గురువారం కాళిదాస కృత శ్యామలాదండకం - సుదర్శన వ్యాఖ్య గ్రంథాన్ని ఆవిష్కరించారు. శ్రీనరసరావుపేట కళావేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మధురభారతి సాహితీ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి ఆచార్య మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి గ్రంథాన్ని ఆవిష్కరించారు. గ్రంథ వ్యాఖ్యాతను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

మంత్రులను కలిసిన ఎమ్మెల్యే చదలవాడ

నరసరావుపేట టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ మంత్రిని ఆనం నారాయణరెడ్డిని, ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను గురువారం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సచివాలయంలో కలిశారు. వారికి త్రికోటేశ్వరస్వామి ప్రసాదాలను అందజేశారు. మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్ళ సందర్భంగా జరగనున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించి, ఏర్పాట్లుకు నిధులను మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఈవో చంద్రశేఖర్, బండారుపల్లి విశ్వేశ్వరరావు, గుర్రం సుబ్రహ్మణ్యం, ఎ.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి ఈ నెల 29, 30 తేదీలలో జరగనున్న కోటప్పకొండ తిరునాళ్ళ సమీక్ష సమావేశాలకు రావాలని ఆహ్వానించారు.

ప్రతి ఒక్కరూ కలసిమెలసి జీవించాలి

● బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య



కార్యక్రమంలో మాట్లాడుతున్న బిషప్ భాగ్యయ్య

కనపర్తి (నాదెండ్ల), జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ క్షమాగుణంతో కలసి మెలసి జీవించాలని ఆర్‌సీఎం బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య అన్నారు. మండలంలోని కనపర్రులో గురువారం జరిగిన మరియ, జోజప్పల నిశ్చితార్థ కల్యాణ మహోత్సవ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన దివ్యపూజాబలి కార్యక్రమంలో మాట్లాడుతూ కుటుంబ వ్యవస్థలో అందరూ సమానమేనన్నారు. ఈ సందర్భంగా చర్చిని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు గోనుగుంట్ల కోటేశ్వరరావులు సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వారికి ఫాదర్ పగడాల చిన్నప్ప ఆశీర్వాదం అందచేశారు. రాత్రి ప్రధానవీధుల్లో బాణసంచా కాలుస్తూ తేరు ఊరేగింపును నిర్వహించారు. చిలకలూరిపేట రూరల్ సీఐ సుబ్బనాయుడు, ఎస్ఐ పుల్లారావు తదితరులు గ్రామంలో బందోబస్తు నిర్వహించారు.



జయప్రద బంగ్లా ఆవరణలో శిలువును తొలగించిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న బాప్టిస్టు సంఘ పెద్దలు

బాప్టిస్టు క్రైస్తవ ఆస్తులకు రక్షణ కల్పించాలి

● బాప్టిస్టు సంఘ సభ్యుల డిమాండ్

వినుకొండ టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): బాప్టిస్టు క్రైస్తవ ఆస్తుల కు రక్షణ కల్పించాలని బాప్టిస్టు సంఘ సభ్యులు గురువారం డిమాండ్ చేశారు. పట్టణంలోని నరసరావుపేట రోడ్డులోని జయప్రద బంగ్లా ఆవరణలో సంఘ సభ్యులు గతంలో ఏర్పాటుచేసిన శిలువను గుర్తు తెలియని వ్యక్తులు తొలగించడంతో వారంతా తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. బాప్టిస్టు ఆస్తులు ఆక్రమణకు గురవుతున్నాయని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుతోపాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావును ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలిసి క్రైస్తవ ఆస్తులను రక్షించాలంటూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ క్రైస్తవుల పక్షాన కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని హామీ ఇచ్చారు. తహసీల్దార్ సురేష్‌ను రికార్డులను పరిశీలించి శిలువ తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్రైస్తవులలో కొందరు దళారులకు కొమ్ముకాస్తూ క్రైస్తవ మిషనరీ ఆస్తులను అక్రమంగా విక్రయిస్తున్నారంటూ జీవీ ఆంజనేయులు వద్ద సభ్యులు వాపోయారు. అనంతరం వినుకొండ పట్టణ పోలీస్ స్టేషన్‌లో డీఎస్పీ నాగేశ్వరరావును కలిసి శిలువ తొలగించిన వ్యక్తులపై చర్యలు తీసుకొని, క్రైస్తవ ఆస్తులకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్టు సంఘ కార్యదర్శి ఆశీ వరప్రసాద్, ఉప కార్యదర్శి కె.వినోద్, మున్సిపల్ వైస్ చైర్మన్ బేతం గాబ్రియేలు, సంఘ పెద్దలు పాల్గొన్నారు. దీనిపై వినుకొండ పట్టణ సీఐ శోభనబాబు మాట్లాడుతూ శిలువను తొలగింపుపై సంఘ పెద్దలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

యువకుడి కుటుంబానికి ఆర్థికసాయం

వినుకొండ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): వినుకొండ హోల్‌సెల్ కూరగాయల మార్కెట్‌లో పనిచేస్తున్న నలబోతుల లక్ష్మయ్య ఇటీవల ప్రమాదవశాత్తూ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దీంతో వినుకొండ కూరగాయల మార్కెట్ అసోసియేషన్ యాజమాన్యం, కూరగాయల యూనిట్ మార్కెట్ యార్డు చైర్మన్ సుంకరి శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ మార్కెట్ నన్నేసాతోపాటు మరికొందరు కలిసి నలబోతుల లక్ష్మయ్య సతీమణి రమణకు రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సెక్రటరీ ఉప్పు కృష్ణ, జాయింట్ సెక్రటరీ తిరుపతి, సలహాదారుడు ఎ.గౌస్ మొహిద్దీన్, అహమ్మద్ పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో పర్యటించిన రోటరీ గవర్నర్

చిలకలూరిపేట టౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ గవర్నర్ కాట్రగడ్డ శరత్ చౌదరి గురువారం చిలకలూరిపేట ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన సుభాష్ చంద్రబోసు విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం మురికిపూడి జడ్పీ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటారు. ఉప్పుమాగులూరులోని ఉన్నత పాఠశాలలో నిర్మించిన టాయిలెట్, యూరినల్ బ్లాక్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు ఏ వేమన రెడ్డి, కార్యదర్శి ప్రసాదు, డైరెక్టర్లు కే వెంకటరావు, ఎం వెంకటేశ్వర్లు, సీహెచ్ శ్రీనివాసరావు, టీవీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.